POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూలై 2023
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 03



సాయిబాబా పత్రిక పాఠకులందరికీ శ్రీ గురుపూర్ణిమ శుభాకాంక్షలు!
(03-07-2023)

## ఈ నెల పండుగలు

జూలై 03 - శ్రీ గురు పూర్ణిమ
జూలై 04 - శ్రీ స్వామి వివేకానంద ఆరాధన
జూలై 15 - శ్రీ స్వామి వివేకానంద ఆరాధన
(తిథి ప్రకారము - ఆషాఢ బహుళ త్రయోదశి)

"సర్వగతమైన ఆత్మ ఒక్కటేనన్న పరమసత్యం మన నిత్య జీవితానుభవానికి వ్యతిరేకం. కాని అట్టిదాన్ని అంగీకరిస్తే తప్ప ప్రతి మానవుడూ సాటివారిని తనవలెనే ప్రేమించడమన్న ప్రాథమిక ధర్మసూత్రానికర్థముండదు. ఆ సూత్రాన్ననుసరించే సకల ధర్మశాస్త్రాలు ఏర్పడ్డాయి. కాని అట్టి ప్రత్యక్షానుభవం లేకపోవడంచేతనే సామాన్యులకు ధర్మాన్ననుష్ఠించడమంత కష్టమౌతుంది. అట్టి అనుభవాన్ని తాము పొంది, తదనుగుణమైన విధంగా జీవిస్తూ, అట్టి అనుభవాన్నాధారంగా గల లీలలను ప్రకటించి భక్తుల జీవితాలను ధర్మబద్ధంగా తీర్చిదిద్దగలవారే మహాత్ములు."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# సత్సంగాలకు సవ్యమైన బాటలు వేయాలి!

**_పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ_**

క్షేత్రమునెంత చక్కగా సిద్ధంచేస్తే పంట అంత బాగా పండుతుంది. ఇలా సిద్ధం చేయడం విత్తనాలు చల్లకముందే ఆరంభం గావాలి. పైరుకు, పైరుకూ మధ్య భూమిని సారవంతం చేసేవి, మన పశువులకు మేతనిచ్చేవీ అయిన మొక్కలు మొలిపిస్తాము. తర్వాత వాటితో మేపిన పశువుల సహాయంతో ముందు ముందు పొలం దున్నుతాము; ఎత్తుపల్లాలు సమం చేస్తాము. రాళ్ళు, పిచ్చి మొక్కలు తొలగిస్తాము. పొలం గట్లు కట్టుదిట్టం చేస్తాము. నేల దున్నడం ద్వారా మట్టిని తిరుగవేస్తాము. వరుసలు దీరిన గాళ్ళు ఏర్పాటు చేస్తాము. వాటిలో విత్తనాలు చల్లి నీరు పడతాము. పైరు మొలుస్తుంటే రోజూ ఉదయమూ, సాయంత్రమూ గూడ వెళ్లి పశువులు చేను మేయకుండా చూచుకుంటాము. మళ్ళీ మళ్ళీ నీరు పడుతుంటాము. ఎరువు వేస్తాము. కంకులొచ్చిన దగ్గర నుండి మిడతలు, తెగుళ్ళు, ఎలుకలు, పిట్టలు పాడుచేయకుండా చూచుకొంటాము. అప్పుడుగాని మంచి పంట చేతికిరాదు. ధర్మము, అర్థము, కామము సిద్ధించవు. మోక్ష సాధనకు అవకాశము దొరకదు. ఇదంతా ఒకరోజు, ఒక సంవత్సరమూ చేస్తే చాలదు. ప్రతిరోజూ, ప్రతి సంవత్సరమూ చేస్తాము. మనకు సంసారము, బాధ్యతలూ వున్నంతవరకూ యిదంతా తప్పదు.

సాధనకూడా సరిగా అలాంటిదే. ఈ జీవితమనే క్షేత్రంలో ధర్మార్థకామ మోక్షాలు సాధించుకునే ప్రక్రియ మోక్షసాధన కవకాశమిస్తుంది. పంట చేతికొచ్చాక మాత్రమే మిగిలిన మొక్కల అవసరం తీరినట్లు నదిదాటగానే పడవ అవసరము, మేడ ఎక్కగానే మెట్ల అవసరమూ తీరినట్లు, నిరంతర సద్గురు ధ్యానము హృదయంలో స్థిరపడి, నిత్య జీవితంలోని ప్రతి సన్నివేశంలోనూ సహజంగానే వారు బోధించిన అవగాహన–లోచూపులతో ధర్మబద్ధంగా నడుచుకొనడం చేతనయ్యాకనే గాని మిగిలిన సాధనలవసరం తీరదు. విత్తులు నాటడానికి ముందు నేల సిద్ధం చేయడం వంటిది – నిత్యజీవితంలో యితరులపట్ల మన భావాలు, ప్రవర్తన సంస్కరించుకొనడం. అదే భగవద్గీతలో 'సత్త్వగుణము', 'దైవీసంపద' అని చెప్పినది; ఆలోచిస్తే వివేకమే – సరియైన యోచన, అవగాహనలే – యిందుకు మూలమని తెలుస్తుంది. సాయి అందవికారాల గురించి, యితరులు మనను బాధించినప్పుడు మనం ప్రవర్తించవలసిన విధానము, అసూయల గురించి చెప్పినదదే. అట్టి యోచన ఒక భాగమైతే, యీ కనిపించేదంతా కలసి సాయి రూపమని గుర్తుంచుకొనడం మరో భాగం. ఈ రెండూ భక్తి – జ్ఞానాలు; నిత్యానిత్య వస్తు వివేకము; అదే వేదాంతంలో 'సాధనషట్క సంపత్తి' అనీ, మొదట నాల్గు జ్ఞాన భూమికలనీ అన్నారు. యోగమార్గంలో యమ నియమాలన్నారు. ఇవి లేక సాధనే లేదు. వీటికి కట్టుబడి ధర్మబద్ధమైన అర్థము, కామము (జీవితావసరాలు) సాధించుకొన్నవారే తర్వాత నాల్గవ పురుషార్థమైన మోక్షానికి ప్రయత్నించడానికి తగినవారు. అలాగాని వారి 'సాధన' అంతా రజోగుణాన్ని, తమోగుణాన్ని అనుసరించి వ్యర్థమవుతుంది; అంతేగాదు – అనర్థదాయకమవుతుంది – రాక్షసుల తపస్సులా. వారికంటే ఏ సాధనాలేకుండా కేవలం తన కర్తవ్యం త్రికరణ శుద్ధిగా నిర్వర్తించుకుపోయేవారు మేలు. అందుకనే

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 జూలై-2023 సంచిక:03

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక,
మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **సత్సంగాలకు సవ్యమైన బాటలు వేయాలి!** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | **కృతజ్ఞత** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | **దివ్య జనని ద్వితీయ ఆరాధన మహోత్సవము** | శ్రీమతి టి.పద్మావతి | 10 |
| 05. | **మాతృదేవి స్మృతులు** | శ్రీ వెంపటి నరసింహం | 13 |
| 06. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 15 |
| 07. | **మరికొందరు భక్తులు** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 08. | **శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు** | శ్రీమతి శ్రీదేవి | 21 |
| 09. | **ఆశాజ్యోతి** | శ్రీ వాసుదేవరావు | 25 |
| 10. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీమతి కేసవరపు రేణుక | 26 |
| 11. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ విజయభాస్కర్ | 27 |


చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

ఛీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ప్రపంచంలోని మతగ్రంథాలన్నింటిలో సాధకులకు ఎన్నెన్నో నియమాలు, ధర్మాలూ చెప్పారు. భగవద్భక్తితో స్వధర్మమాచరించి ఋణానుబంధాలు తీర్చుకొనకుండా మోక్షానికై యత్నించడం నరకప్రదమవుతుందని మనువు ధర్మశాస్త్రంలో చెప్పాడు.

అయితే, పొలం విషయంలో ఆకలి, జీవితావసరాలే మనంప్రతిరోజూఏమారకండామనకర్తవ్యంనెరవేర్చుకొనేలా చేస్తుంది. కాని సాధన విషయంలో అలాగాదు. ఎన్నిసార్లు విన్నా, దానిపై మన దృష్టి మందగిస్తుంది. మన భావాలను, ప్రవర్తననూ పట్టించుకోకుండా పూజ, పారాయణ, సత్సంగాలూ యాంత్రికంగా చేస్తాము. అందుకు ఋజువు ఒక్కటే – క్రమంగా సత్సంగంలో సాధనకు సంబంధించని భావాలు తలెత్తుతాయి. ఎవరిమాట నెగ్గాలి? ప్రాబల్యము, ప్రాతినిధ్యమూ ఎవరివి? అన్న ఆందోళనలు ప్రారంభమవుతాయి. అంటే అధిక-న్యూనతలు చోటు చేసుకొంటాయి. ప్రతివారూ తాము లేకపోతే ఆ కార్యక్రమమే లేదన్న పరిస్థితి తెచ్చుకోజూస్తారు; అంతటితో పోటీలు భేదాలు పుడతాయి. ప్రతివారు సాటిభక్తులను తమ వర్గీయులుగా చేసుకో యత్నిస్తారు.

ఇది సత్సంగమనే పైరుకు పట్టే తెగులు. దీని నివారణమొక్కటే – ఎప్పుడీ సత్సంగ సభ్యులు కలుసుకొన్నా మరే సభ్యుణ్ణి గురించి వ్యక్తిగతంగా చర్చించుకోకూడదు. ఇలా చెప్పినా ఈ బలహీనత నాపుకోలేనివారు అలాంటివి ప్రస్తావించినపుడు మనం ఒకటి రెండు మాటలలో దాని అనౌచిత్యం చెప్పి, సాయి చెప్పిన సూక్తులు జ్ఞాపకం తెచ్చి విడచిపెట్టాలి. ఆపై యింకా మాట్లాడుతుంటే యుక్తిగా ప్రస్తావన మార్చాలి. అది వీలుగాకుంటే చాకచక్యంగా అచటివారిని పిలుచుకొని వెళ్ళిపోవాలి. ప్రపంచ చరిత్రలో రాజకీయము, సాంఘికములూ అయిన ధ్యేయములేగాక ఇస్లాము, క్రైస్తవ మతప్రచార సంఘాలు ఈ సూత్రాన్ని పాటిస్తాయి. అందుకే మనవంటి సామాన్యులైన మానవులే ఆ సంఘాలలో కూడా వున్నప్పటికీ వాటి కార్యాలు అంత సమర్థవంతంగా నడుస్తాయి. దానికితోడు కొంతకాలం సత్సంగాలలో పాల్గొని నిర్వహిస్తున్న సభ్యులు, కార్యకర్తలూ 1 లేక 3 నెలలకొకసారి 'ఆత్మవిమర్శ' శిబిరాలు నిర్వర్తించుకొనడం మంచిది. ఇందులో ఒకరికొకరు ఆత్మీయతతో సాయికార్యం చక్కగా కొనసాగడానికని, మన సాధన నిర్దుష్టమవ్వాలన్న తలంపుతో ఎవరి బలహీనతలు వారు మిగిలినవారి ఎదుట, సాయి ముందు హృదయపూర్వకంగా పశ్చాత్తాపంతో చెప్పేసుకొని, నాటినుండి వాటిని విడిచేయత్నం చేయాలి. పై తెల్పిన పంతాలు, పోటీలనూ యిందులో బీజాలుగా వుండగానే త్రుంచివేసుకొనే యత్నం చేయాలి. మనలో ఎవరైనా వారి లోపాలు దిద్దుకోలేకపోతే ఒకటి రెండు సార్లు హెచ్చరించి విడచిపెట్టాలి గాని దానినే విమర్శగా ప్రతివారూ చర్చించుకోకూడదు. దానిని పట్టించుకోకుండాను, అది మన హృదయాన్ని కలుషితం చేయకుండాను చూచుకొంటూ వారు చేసే భక్తికార్యాలలో మాత్రం ఏ భేదభావమూ వహించకుండా పాల్గొనాలి. ఇలా కలుపు తీసుకోకుంటే, తెగుళ్ళ నివారణ చేసుకోకుంటే పైరు వేయడమంతా వ్యర్థమే గాక ఎన్నో బాధలకూ, పాపాలకూ కారణమై నష్టమెక్కువ జరుగుతుంది. ఏ వ్యక్తులలోనైనా నివారించుకోలేని బలహీనతలు, పొరబాట్లు, ముక్కోపము, తొందరపాటు, అలిమిగాని అసూయ, ద్వేషమూ వుంటే వాటిని మంచి హోమియో వైద్యంతో నివారించుకోవాలి. వారలా నివారించుకొనేదాకా వారిలోని బలహీనతను వ్యాధిగా తలచి పట్టించుకోకుండా వుండాలి. అది లోపంగా ఎంచి దానినాధారం చేసుకొని ద్వేషము, పంతము, దెబ్బకుదెబ్బ తీయడము వంటి పొరబాట్లు చేసి మన సాధనను పాడుచేసుకోకూడదు. సాటివారికి చెప్పి వారి హృదయాలను మలినపరచగూడదు. ఈ జాగ్రత్త తీసుకోనందువల్ల ఎన్నో మంచి ఉన్నతాశయాలతో ఆరంభమైన సంస్థలు, సమాజాలూ గూడ చెడుకు నిలయాలుగా, కేంద్రాలుగా మారుతున్నాయి.

ఇదెంత అవసరమో క్రీస్తు చెప్పినమాట తెల్పుతుంది – "దేవునికి నైవేద్యమిచ్చే ముందు నీవెవరికైనా అన్యాయం చేశావేమో చూచుకో; దానికి ప్రతిక్రియ చేసి, వారి క్షమకోరి, అందుకు భగవంతుని క్షమించమని ప్రార్థించి అప్పుడు నైవేద్యమివ్వు. అప్పుడే ఆయన దాని నంగీకరిస్తారు". సాయి – మలభక్షణ చేస్తున్న పంది ఉదాహరణతో – తెల్పిన మహత్తర సత్యాన్ని స్మరించినా యిదే తెలుస్తుంది. ఇది సాధనకు ఆయువుపట్టు వంటిది. ఇలా సత్సంగాన్ని నిర్దుష్టంగా వుంచుకొంటేగాని తర్వాత ధ్యానము, జపము, పారాయణలు సరిగా జరుగవు. క్షేత్రం బాగుండకపోతే మంచిపైరెలా వస్తుంది? ●

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## *ప్రశ్న :- గ్రహణ దినాల్లో దేవాలయాల్లో పూజాది కార్యక్రమాలు ఎందుకు నిషేధించారు?*

*- అయితా సత్యనారాయణ, సూళ్ళూరు పేట*

**జవాబు :-** అటు అనంత విశ్వానికి ఇటు మానవుడికి పరమాత్మ తత్త్వంలో ఐక్యమున్నది. సామరస్యమున్నది. దానిని వివరించడంలో అండాండ పిండాండాలకు పోలిక, సంబంధము వివరించారు ఋషులు. అలానే జ్యోతిష్య శాస్త్రజ్ఞుల ప్రకారం సూర్యుడు ఆత్మకారకుడు; చంద్రుడు మనఃకారకుడు;భూమిదేహానికికారకురాలు.ఏగ్రహణమైనా మనస్సు అంతర్ముఖమై ధ్యానస్థమవడానికి సంకేతం. కనుక అపుడు పూజాదికాలు చేస్తూ మన మనస్సును, యిష్టదైవాన్ని బహిర్ముఖం చేయగూడదు. ఇష్టదైవం కూడా ధ్యానస్థుడై యుంటాడని భావం. పూజించడమంటే దైవం యొక్క దృష్టిని మనమీదకు భేదభావంతో మరల్చుకొనడమన్నమాట. గ్రహణమపుడు మనముకూడా ధ్యానస్థులమై అభేదభావంతో ఆయనతో తాదాత్మ్యానికి యత్నించాలి. ●

---

## *ప్రశ్న :- ధనుష్కోటిలో సిద్ధారూఢస్వామి సముద్ర స్నానం చేస్తున్న ఒక యాత్రికుని "నువ్వెందుకు స్నానం చేస్తున్నావు?" అని అడిగితే అతడేమీ చెప్పలేక "శరీరశుద్ధికి" అన్నాడు. అసలు సముద్ర స్నానమెందుకు చేస్తారు?*

*- శ్రీమతి శారద, హైదరాబాదు*

**జవాబు :-** మీరు వ్రాసినట్లు సముద్ర జలంలోని లవణాలు మొ॥నవి శరీరానికి మంచివన్నది స్థూలమైన కారణం. వివిధ పవిత్ర నదీజలాలు – వాటిలో ఎందరో మహనీయులు అర్ఘ్యాదులు విడవడం వలన వాటి తీరాలలో మహనీయులు స్నానము, తపస్సు ఆచరించడం వలన వాటికి పాత్రులయిన సాధకుల పైన పవిత్రమైన అంతరంగిక ప్రభావముంటుంది. అట్టి నదులెన్నో సముద్రంలో కలుస్తాయి. గనుక అన్నింటిలోనూ స్నానమాచరించిన ఫలితం సముద్రస్నానం వలన శ్రద్ధావంతులకు కల్గుతుంది. అంతేగాక బాహ్య ప్రకృతిలోని కొన్ని వస్తువులు నిగూఢమైన ఆధ్యాత్మిక సత్యాలను స్మరింపజేసేవిగా వుంటాయి. సముద్రము అపారము, అనంతము, భూమి పైయున్న జలమంతటికి నిలయము అవడం వలన భగవంతుని ఇట్టి గుణాలను మనసుకు స్ఫురింపజేస్తుంది. అంటే దాని దర్శనమువల్లనే మనస్సు అల్పమైన లౌకిక భావాలనుండి మనలను వుద్ధరిస్తుంది. అందుకే దానిని చూస్తూ వుంటే మనస్సు నిరామయమై తన్మయత కల్గుతుంది. ఆకాశము నిర్గుణ బ్రహ్మాన్ని గురించి జ్ఞాపకముచేస్తే, సముద్రము సగుణబ్రహ్మ అయిన సద్గురువును స్ఫురింపజేస్తుంది. అట్టి భావంతో స్నానం చేస్తే సద్గురు గుణభావ పారవశ్యం కల్గుతుంది. సద్గురువుని ఆశ్రయించని వారికి ఈ భావమంత స్పష్టంగాదు. కనుక ఫలితమల్పం. సద్గురువైన శ్రీ సిద్ధారూఢులని గుర్తించలేని ఆ యాత్రికుడందుకే సరియైన సమాధాన మివ్వలేకపోయినాడు. ●

(అక్టోబరు 2014 సాయిబాబా మాసపత్రిక నుండి)

# కృతజ్ఞత

## పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

"కృతజ్ఞతకు మారుపేరు సాయి" అన్నారు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు. ఇతరులు మనకు చేసిన మేలును గుర్తించి వారిపట్ల భక్తి గౌరవాలు కలిగివుండడాన్ని 'కృతజ్ఞత కలిగివుండటం' అంటారు. ఈ కృతజ్ఞతకు సూచనగా సహాయం చేసినవారికి సహాయం పొందినవారు ఏదైనా తిరిగి కృతజ్ఞతగా సమర్పించడం కూడా జరుగుతూ వుంటుంది. ఆలోచిస్తేగాని ఎవరికి, ఎప్పుడు, ఎందుకు, ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో స్పష్టంగా తెలియదు. అందుకనే చాలామంది తమకు ఇతరులు చేసిన మేలుకు బదులుగా తమకు శక్తి వున్నప్పటికీ స్వల్పంగా మాత్రమే ప్రతిఫలమిస్తారు. కొందరు ఇతరులనుంచి తమకు ఏ చిన్నపాటి శ్రేయస్సు కలిగినా ఎంతో స్పందించి వారికి సహాయం చేస్తారు.

మరికొందరు తమకు ఇతరులు చేసిన మేలును గుర్తించను గూడా గుర్తించలేరు. అంతేగాక వారికి అపకారం కూడా చేయతలపెడతారు. వీరినే 'కృతఘ్నులు' అంటారు. ఇటువంటి వారి వల్ల తమకు, ఇతరులకూ గూడా చాలా అశాంతి కలిగి పరిస్థితులు దారుణంగా తయారవుతాయి. దీనినే 'స్వార్థపరత్వం' అంటారు. మానవులలో ఈ స్వార్థగుణం పెచ్చుపెరిగిన కొద్దీ కృతఘ్నత పెరుగుతూ పోతుంది. ఎంతసేపటికీ తమకు ఇతరులవల్ల వచ్చే లాభాన్ని గురించే ఆలోచిస్తారు గనుక అవతలివారిని మోసం చేసైనాసరే తాము లాభం పొందటానికి ప్రయత్నిస్తారు. వీరివల్ల బాధపడిన వ్యక్తులు, వీరిని చూసిన మరికొందరూ గూడ 'మనమెందుకిలా వుండకూడదు?' అని వారుకూడా స్వార్థపరంగా వుండడాన్ని అలవరచుకుంటారు. కొంతకాలానికి అలాంటివారు ఎక్కువవుతారు. దానివలన ప్రపంచంలో అరాచకం ప్రబలుతుంది. చివరకు ఎవరైనా ఇతరులకు సహాయం చేయ సంకల్పిస్తే గూడా అవతలివారి స్వార్థపరత్వం వల్ల అది చెడుగా తయారవుతుంది. చివరకు 'మనం ఎందుకు ఇతరులకు సహాయం చేసామా!' అని బాధపడవలసి కూడా వస్తుంది. నేటి సమాజ దుస్థితి ఇదే! అట్లాగని ఈ సమాజంలో ఎంతోమంది మంచివాళ్ళు లేకపోలేదు. అయితే వారిలో చాలామంది ఇతరులకు సహాయం చేసి మోసపోవటం కూడా కద్దు.

కృతజ్ఞతగా వుండటం అనేది మానవులకు తప్పనిసరిగా వుండవలసిన గుణం. కారణం ప్రతివారూ ఏదో ఒక విధంగా ఇతరుల మీద ఆధారపడక తప్పదు. ఏ అవసరాన్ని మనం పొందుతున్నా అది ఇతరుల భాగస్వామ్యం లేకుండా జరుగదు. ఉదాహరణకు మనకు ఉదయం కాఫీకి కావలసిన పాలు, కాఫీపొడి, పంచదార తీసుకుంటాము. పాలు కావాలంటే గేదెలను పెంచేవారు, మనకు పాలు ఇచ్చేవారు కావాలి. మనకు వాళ్ళ దగ్గరకు వెళ్ళలేని పరిస్థితి వుంటే మనింటికి వచ్చి ఇచ్చేవారు కావాలి. పంచదార, కాఫీపొడి తయారు చేసేవారు, వాటిని ఇతరులకు లభింపజేసేవారు లేకపోతే అవి మన చేతికిరావు. ఇలాగే ప్రతి విషయంలో గూడా! ఎన్నో విధాల, ఎంతోమంది శ్రమ, సహాయం లేకుండా మన పనులేమీ జరుగవు. 'దానిదేముంది? మనం డబ్బులిచ్చి కొనుక్కొంటున్నాము కదా?' అని అనుకోవచ్చు. కానీ మన దగ్గర డబ్బులున్నప్పటికీ, అవతలివాడికి డబ్బులు అవసరమున్నప్పటికీ వాడివ్వకపోతే మనమేమీ చేయలేము. మనం గేదెలను పెంచుకోలేము. అలాగే పంచదారకు అవసరమైన చెరుకు పంటను, కాఫీ పంటను పండించలేము. కనుక డబ్బు వుండడమే సరిపోదు. అవతలివాడి సహాయం తప్పక కావాలి. అందుకని ఈ ప్రపంచంలో ప్రతి సుఖం

వెనకాల ఇతరుల శ్రమ దాగివుంటుంది. ఇది గుర్తిస్తేగానీ మన జీవితాలు సక్రమంగా నడవవు.

అంతేగాక పంచభూతాలపట్ల గూడా మనం కృతజ్ఞత కలిగి వుండాలి. పంచభూతాలు లేకుండా ఒక్క క్షణం కూడా మనం జీవించలేము. అవి మన ప్రాణాధారాలు. అందుకని పెద్దలు నిదురలేవగానే భూమికి కృతజ్ఞతతో నమస్కరించాలని చెప్పారు. "అమ్మా, నీ మీద కాలు మోపుతున్నాను. మలమూత్ర విసర్జన చేస్తున్నాను. మా నిత్యావసరాల కోసం నిన్ను తవ్వడం, దున్నడం మొదలైనవి చేస్తున్నాను. నీపై జన్మించిన ఈ బిడ్డను క్షమించి, ఆశీర్వదించి కాపాడవలసినది" అని ప్రార్థనచేసి భూమిమీద కాలుమోపమని చెప్పారు. అలాగే సూర్యునిపట్ల (అంటే అగ్నిదేవునిపట్ల), వాయుదేవునిపట్ల, జలముపట్ల, వీటన్నింటినీ తనలో ఇముడ్చుకున్న ఆకాశముపట్ల కృతజ్ఞత కలిగివుండాలని చెప్పారు.

అంతేగాక మానవజన్మ రావడానికి కారణభూతులైన తల్లిదండ్రులపట్ల, వారికి కారణభూతులైన పెద్దలపట్ల గూడా కృతజ్ఞత కలిగివుండాలని చెప్పారు.

ఈ శరీరం సక్రమంగా పనిచేయడానికి కారణాలైన మెదడు, శ్వాసకోశములు, హృదయము, మూత్రపిండములు, వాటివల్ల పనిచేసే ఇతర అవయవాలు – వీటి పట్ల కూడా కృతజ్ఞత కలిగి వుండాలి. కారణం వీటిలో ఏది సక్రమంగా పనిచేయకపోయినా మన శరీరం కుంటుపడుతుంది. దీనినే 'వైకల్యము' అంటారు. అందుకని ఈ శరీరాన్ని జాగ్రత్తగా పోషించుకుంటూ, దాని ద్వారా మనం అవసరాలను తీర్చుకుంటూ, ఈ శరీరం పట్ల కూడా కృతజ్ఞత కలిగివుండాలి. ఇక్కడ తమాషా ఏమిటంటే ఇవన్నీ చేయడానికి కారణాలైన మనస్సు, మెదడు చేతనే మనం వాటికి కృతజ్ఞత చెబుతున్నామన్నమాట. అంటే కృతజ్ఞత చెప్పటానికి అవసరమైన మనస్సుకు కృతజ్ఞతాభావం కలిగివుండాలని ప్రబోధిస్తున్నామన్నమాట. అందుకని ఇతర వికారాలకు లోనుగాకుండా సత్యమైన వాటిని గుర్తించి, వాటిపట్ల కృతజ్ఞత కలిగివుండాలని మనస్సుకు ప్రబోధిస్తూ వుండాలి. ఈ ప్రబోధించే దానినే 'బుద్ధి' అంటాము. బుద్ధి అనేది సక్రమంగా పనిచేయకపోతే మనస్సు అనేక పెడమార్గాలు పట్టవచ్చు. దానివల్ల వచ్చే కష్టాలు అనుభవించవలసిరావచ్చు.

అయితే ఈ బుద్ధికి మంచి, చెడు తెలిసేది ఎట్లా? ఏది మంచో, ఏది చెడో ఎలా తెలుస్తుంది? దానిని చెప్పగలవారు ఎవరైనా వున్నారా? దీనికి సమాధానం చెప్పగలవారు మహాత్ములు, సద్గురువులు. వారు నిస్వార్థంగా జీవిస్తారు. తమకోసం ఏ మాత్రమూ జీవించరు. కనుక నిరంతరం ఇతరుల శ్రేయస్సు కోసం పాటుపడతారు. మానవులు ఏ విధంగా ప్రవర్తిస్తే ప్రశాంతి పొందుతారో, దానివల్ల వచ్చే లాభమేమిటో వివరించి చెప్పి, వారిని సన్మార్గాన నడిపించ ప్రయత్నిస్తారు. సద్గుణాలేమిటో, దుర్గుణాలేమిటో, స్వార్థపరత్వం వల్ల వచ్చే నష్టమేమిటో, నిస్వార్థంవల్ల వచ్చే లాభమేమిటో నిర్దుష్టంగా తెలియజేస్తారు. అలాంటివారే కొందరు ధర్మశాస్త్ర గ్రంథాలు, పురాణాలు మొ॥వి రచించి మనకు అందిస్తారు. ఎప్పటికప్పుడు ఈ మహాత్ములు అప్పటి కాలపరిస్థితులకు అనుగుణంగా ధర్మాన్ని బోధిస్తారు. వారివల్ల వారి చెంతకు వచ్చిన చాలామంది సన్మార్గాన నడవటం జరుగుతుంది. కొందరు తామున్న స్థితికంటే మెరుగైన స్థితిని కూడా పొందుతారు. అందువల్ల సుఖశాంతులు కలిగి; వారికి, వారి ప్రక్కనున్నవారికి కూడా కొంత శ్రేయస్సు కలుగుతుంది.

మహాత్ములు కేవలం లౌకిక శ్రేయస్సును ప్రసాదించడం మాత్రమేగాక, సకల అనర్థాలకు, అశాంతికి, దుఃఖానికి కారణమైన మూలసమస్యను తెలియజెప్పి పరిష్కారం చూపుతారు. అంతేగాక అందుకు ప్రయత్నించిన వారిని చేయిపట్టుకుని పరమార్థం వైపుకు నడిపిస్తారు.

అలా సన్మార్గాన నడిపించే మహాత్ములలో శ్రేష్ఠులు శ్రీ శిరిడీ సాయినాథులు. ఆయన లోకశ్రేయస్సు చేకూర్చే పథకంలో ఉపకరణంగా పూజ్యశ్రీ మాస్టరుగారిని ఎన్నుకున్నారనడంలో సందేహం లేదు.

పూజ్యశ్రీ మాస్టరుగారు మొదట నాస్తికులే అయినా ఆయనను ఏదో ఒక మిషమీద తన దగ్గరకు రప్పించుకుని ఆయనను తన మార్గాన్ని నడిపించేవారిగా మలచుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు సాయిబాబా వద్ద ఆత్మానుభూతిని పొంది ఆయన అపారకరుణకు ముగ్ధులై కృతజ్ఞతగా తమ జీవితాన్నే బాబాకు సమర్పణ చేసుకున్నారు. జీవితమంతా ఆయన సేవలోనే అనుక్షణం నిమగ్నమైనారు. ఇంతకుమించి ఎవరైనా, ఎవరిపట్లనైనా కృతజ్ఞత కలిగివుండటం ఏమున్నది? అందుకని కృతజ్ఞతకు మరోపేరు పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా! ఆయన మాట్లాడే ప్రతిమాటా, చేసే ప్రతి చర్యా సాయిబాబా సేవలో భాగమే. శ్రీ సాయిబాబాను గూర్చి, ఆయన చర్యలు – లీలలగూర్చి వివరించి, ప్రతివారూ శ్రీ

సాయిబాబా వల్ల తను పొందిన శ్రేయస్సును పొందాలని ఆరాటపడ్డారు. అందుకై ప్రవచనాల ద్వారా, గ్రంథాల ద్వారా, చర్చల ద్వారా అనుక్షణమూ ఇతరులకు బోధ చేస్తూనే వున్నారు. అందువల్లనే నేడు మనమందరమూ మన సంస్కారాలననుసరించి కొద్దోగొప్పో శ్రేయస్సును పొందగలుగుతున్నాము. పూజ్యశ్రీ మాస్టరుగారు కోరుకున్న పారమార్థిక స్థాయిని అందుకోలేకపోయినప్పటికీ అందుకోసం ప్రయత్నం చేసేవారు ఎందరో వున్నారు. లౌకిక శ్రేయస్సును మాత్రమే కోరేవారికి లౌకిక శ్రేయస్సును ప్రసాదిస్తూనే తమ బోధల ద్వారా వారిని పరమార్థం వైపుకు నడిపిస్తారు. ఉదాహరణకు ఒక సమస్యకు పరిష్కార మార్గం చెబుతూనే ఆయన యిలా అంటారు – "ఫలానిది చేస్తే నీకు ఈ సమస్య తొలగుతుంది. కానీ సమస్యలపైన సమస్యలు నిరంతరం వస్తూనే వుంటాయి. వీటికి అంతెక్కడ? అలాగాక వీటికి మూలమైన దానికోసం ప్రయత్నిస్తూవుంటే ఈ సమస్యలు నీటిమీద గీతల్లాగా వచ్చి వెళ్ళిపోతుంటాయి. అవి నీ మనస్సును ఏమాత్రం ప్రభావితం చేయలేవు. సమస్యలకు పరిష్కార మార్గాలకోసం ప్రయత్నిస్తూనే మనస్సును అశాంతివైపుకు మళ్ళకుండా వుంచుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే శాంతి లభిస్తుంది. చూడు, ఏ మనిషైనా సమస్యలతో బాధపడకుండా వున్నాడేమో! ప్రస్తుత ప్రపంచమంతా సమస్యల వలయంలో చిక్కుకుని అశాంతితో కుతకుతలాడిపోతోంది. అలాగాక ఇదే ప్రపంచంలో వుంటూనే శాంతిని పొందగలవారు, నిశ్చింతగా వుండగలవారు మహాత్ములు మాత్రమే. అందుకని వారిని దర్శిస్తూ, వారు చెప్పినవాటిని ఆచరిస్తూపోతూవుంటే మన సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం లభిస్తుంది" అని చెప్పేవారు. వాచా చెప్పటమేగాక ఎంతోమంది మహాత్ములను తాను దర్శించి, వారి దర్శనం చేసుకుని వారి కృప పొందవలసినదని చెప్పి ఎందరికో వారి దర్శన ఆశీస్సులను లభింపజేశారు. ఈనాటి కొందరు గురువుల్లాగా తన దగ్గరకు వచ్చినవారు తమనే సేవించాలనీ, తమను విడచి మహాత్ముల వద్దకు వెళ్ళకూడదనీ చెప్పలేదు, శాసించలేదు. ఆయన వద్దకు ఎవరైనా ఎప్పుడైనా రావచ్చు. వద్దని వెళ్ళిపోనూవచ్చు. ఆ స్వాతంత్ర్యాన్ని కూడా యిచ్చారాయన. ఆయన యిలా అనేవారు "నా వద్దకు వచ్చినవారి వల్ల నాకు గల లాభమేమున్నది? రానివారివల్ల వచ్చిన నష్టమేమున్నది? వచ్చినవారికి బాబా సేవగా భావించి బాబా గురించి చెబుతాను. లేకపోతే బాబా స్మరణ చేసుకుంటాను. నాది నష్టంలేని వ్యాపారం. ఎవరు వచ్చినా, రాకపోయినా, పూజించినా, దూషించినా నాకు ఒరిగేదేమీ లేదు. నా తెల్ల వెంట్రుక ఒక్కటి గూడా నల్లబడదు. నా జీవితకాలం పొడిగింపబడదు. అందుకని సాయిబాబా కృపకు పాత్రుణ్ణి కావడానికి మాత్రమే నిరంతరం నేను ప్రయత్నిస్తూ వుంటాను. బాబా కృపను మించి నాకేమీ అవసరం లేదు. అందులో భాగంగానే వచ్చినవారికి ఆయన గురించి చెప్పడం, వ్రాయడం చేస్తుంటాను. సాయిబాబా వల్ల వారు శ్రేయస్సు పొందితే చాలు". ఆయన చెప్పినట్లే ఆయన తన జీవితాన్ని బాబా సంకల్పించిన యజ్ఞంలో సమిధగా చేసుకున్నారు.

శ్రీ సాయిబాబా పట్ల కృతజ్ఞతతో మాస్టరుగారు సాయిబాబా గురించి, ఆయన లీలలు, బోధల గురించి ఎందరికో తెలియజెప్పి ఎందరినో సన్మార్గాన నడిపించారు, నేటికీ నడిపిస్తున్నారు. ఈనాడు మనమందరమూ ఎన్నో విధాలుగా పూజ్యశ్రీ మాస్టరుగారి వలన సమస్యలను తొలగించుకొని సుఖశాంతులను పొందగలుగుతున్నాము. అందుకని మనం ఆయన పట్ల కృతజ్ఞత కల్గి వుండటం ధర్మం. అందులో భాగంగా మనం ఆయనను సేవిస్తూ ఆయన పుట్టినరోజును ఘనంగా జరుపుకుంటున్నాము. ఆయన బోధించిన మార్గాన మన శక్తిని అనుసరించి పయనించడానికి ప్రయత్నిస్తున్నాము.

క్రిందటి సంవత్సరము ఆయనపట్ల కృతజ్ఞతగా ఆయనకు 75 సం॥లు నిండిన సందర్భంగా ఎన్నోచోట్ల అతి సంతోషంగా, ఘనంగా 'కృతజ్ఞతా మహోత్సవ వేడుకలను జరుపుకున్నాము. ఈ సం॥ము కూడా క్రిందటి సంవత్సరం వలెనే ఆయన పుట్టినరోజు విశిష్టతను సంతరించుకున్నది. ఈ సంవత్సరము జన్మతిథి, నక్షత్రము, ఆంగ్లతేదీ ఒకే రోజున కూడివున్నాయి కనుక ఈ 77వ జన్మదినాన్ని కూడా ఉప్పొంగిన సంతోషంతో, ఉత్సాహంతో మన శక్తిమేరకు భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం అవసరం. అందుకని ఆయన మార్గాన మనము ఇంకా ముందుకు నడవాలని, అలా నడిపించమని ఆయనను, ఆయన గురువైన శ్రీ శిరిడీ సాయిబాబాను ప్రార్థిద్దాము. ఇంకా యింకా ఆయనపట్ల కృతజ్ఞతాభావం పెంచుకోవడానికి ప్రయత్నిద్దాము. అందులో భాగంగా మనంకూడా మన మనస్సును, వాక్కును, కర్మను ఆయన కొరకు అంకితం చేద్దాము. ఆయన సంపూర్ణ అనుగ్రహాన్ని పొందుదాము. ●

# దివ్య జనని ద్వితీయ ఆరాధన మహోత్సవము

***శ్రీమతి టి.పద్మావతి***

*శ్రీ సచ్చిదానంద సద్గురు*
*సాయినాథ్ మహరాజ్ కి జై !*
*శ్రీ సచ్చిదానంద సద్గురు అలివేలుమంగమ్మ సహిత*
*భరద్వాజ మహరాజ్ కి జై !!*

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి ద్వితీయ ఆరాధన మహోత్సవం జూన్ 3, 4వ తేదీలలో గుమ్మళంపాడు అలివేలుమంగమ్మ దివ్య సన్నిధానములో అంగరంగ వైభవంగా జరిగింది.

రెండవ తేదీ సాయంత్రం దూరప్రాంతాల నించి వచ్చిన భక్తులతో, వారందరికోసం ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లతో ఆ ప్రాంగణమంతా అత్యంత రమణీయతను సంతరించుకున్నది. ఆ రాత్రంతా పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి సమాధి మందిరం అలంకరణలోనూ, షామియానాల ఏర్పాట్లలోనూ, నక్షత్రాలను తలపించే విద్యుద్దీపాల అలంకరణలోనూ భక్తులందరూ పాల్గొని సేవ చేసుకున్నారు. మూడవతేదీ ఉదయానికల్లా పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన గ్రంథాల విక్రయశాలలు, వేసవి తీవ్రతను తట్టుకోవడానికి చల్లటి పానీయాలను సరఫరాచేసే గుడారాలు, ప్రత్యేక వంటశాలలు, సర్వాంగ సుందరముగా అలంకరించిన పూజ్యశ్రీ బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు కొలువైవున్న వేదిక – ఇవన్నీ ప్రత్యక్షమయ్యాయి.

జూన్ 3వ తేదీ ఉదయం 5-30 గంటలకి మేలుకొలుపుతో ఆరాధనా మహోత్సవం ప్రారంభమయ్యింది. కాకడ హారతి తరవాత పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి మంగళస్నానాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయానికి ఒంగోలు నించి పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సులో చాలామంది భక్తులు చేరుకున్నారు. ఆనాటి మంగళ స్నానాలకు ఒక ప్రత్యేకత వుంది. కృష్ణ, కావేరి, పెన్నా, గోదావరి, తుంగభద్ర, త్రివేణి సంగమం, మొదలైన నదీ జలాల తీర్థం, తిరుపతి చక్రతీర్థం, మక్కానించి వచ్చిన నదీ జలాలు, సముద్ర జలాలు, డ్రైఫ్రూట్స్‌తో కలిపిన పంచామృతాలు, విభూది, గంధము, స్వచ్ఛమైన పన్నీరు, తులసి, మారేడు, తొమ్మిది రకాల పళ్లరసాలతో పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి భక్తులందరూ తనివితీరా మంగళస్నానాలు ఆచరింపచేసారు.

అంతేకాదు శ్రీ చివటం అమ్మ, శ్రీ సుధీంద్రబాబు, శ్రీ పోలయ్య తాత, శిరిడి సాయినాథుడు మొదలైన మహాత్ములనించి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి ఆరాధన మహోత్సవం దిగ్విజయంగా జరగడానికి ఆశీస్సులు, ప్రసాదం లభించాయి. మంగళస్నానాల అనంతరం పూజ్యశ్రీ అమ్మగారికి ప్రత్యేక పుష్పాలంకరణ జరిగింది. పారాయణ, ఉపాహార నివేదన తరువాత శ్రీ ద్వారకబాబు గారి దంపతులు పూజ్యశ్రీ అమ్మగారికి అష్టోత్తర శతనామావళి సహిత షోడశోపచార పూజ చేసారు.




శ్రీ ద్వారకబాబు గారు పూజ్యశ్రీ అమ్మగారి ఆరాధన సందర్భంగా సత్సంగం చేశారు. అందులో భాగంగా,,,,,"దేవుడు, భక్తి, ఆధ్యాత్మికత అంటే ఒకొక్కరోజు ఒకొక్కళ్ళకి ఒకొక్క అభిప్రాయం ఉంటుంది. దానికి కారణం ప్రతీవాడూ ప్రసార మాధ్యమాలలో ఎవడికి ఇష్టం వచ్చిన సిద్ధాంతం వాళ్ళు చెప్పడమే. మహాత్ముల బోధలు, గ్రంథాలూ సరిగ్గా చదువుకుని అర్థం చేసుకోకపోవడం ఈ సమస్యకి కారణం.

కొంతమంది ధీరులు, ఒకే భూమిలోనించి, మిరపకాయ, అరటిపండు ఎలావస్తున్నాయి? ఒక స్త్రీ మూర్తిలోనించి ఇంకొక జీవం ఎలా వస్తున్నది? అని తరచి తరచి ఆలోచించి, ప్రశ్నించుకుని, 'ఈ సృష్టి మొత్తం ఒకే శక్తి ఇన్ని రూపాలూ ధరించి నడుపుతున్నది, అదే నువ్వుగా కూడా వుంది ' అని చెప్పారు. దీనిని గుర్తించడానికి చేసే ప్రయత్నంలో మన మనస్సు స్వచ్ఛంగా ఉండాలి. ఆధ్యాత్మికతలో నీ ప్రవర్తనకి నీదే బాధ్యత, ఇంకొకరిది కాదు. నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి. ఈ బాధ్యత మనం తీసుకోకపోతే ప్రతివాడూ గురువై మనల్ని ఆడుకుంటాడు. కనుక ఇలా సాధించిన వాడిని ఆదర్శంగా పెట్టుకుని ప్రయత్నం చేసుకుంటూ పోవాలి కానీ, ఎవడూ మన నెత్తిన చెయ్యిపెట్టి ఏదీ ఇవ్వడు. మహాత్ముల బోధలను అనుసరిస్తూ ఒకరికి ఒకరు తోడ్పడుతూ ప్రయత్నం చెయ్యాలి. అలా ప్రయత్నం చేసిన ప్రతీవాడూ గెలిచాడు — అంటూ 'వాడి, వేడి' ఉదాహరణలతో సత్సంగాన్ని పూర్తిచేస్తూ, 'అందరిలో తానుగా వున్న "అమ్మని" అందరినీ మంచి మార్గంలో నడిపించమని ప్రార్థిస్తున్నాను' అని చెప్తూ, 'ఈరోజు గం॥1-12 నిముషములకు పూజ్యశ్రీ అమ్మగారు పరిమితమైన దేహం వదిలి విశ్వవ్యాప్తమైనారు. ఆ సమయం చాలా పవిత్రమైనది, ఆ సమయంలో మన మనస్సుని ప్రశాంతంగా ఉంచుకుంటే, నేను అన్న భావన వీడటానికి సంసిద్ధంగా ఉంటుందని శాస్త్రాలు చెప్పాయి కనుక ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పూజ్యశ్రీ అమ్మగారికి కృతజ్ఞతతో హారతి చేసుకుందాం" అంటూ సత్సంగాన్ని ముగించారు. సరిగ్గా గం॥1-12ని॥లకు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి ప్రత్యేక హారతినిచ్చారు. అనంతరం గురుకులం పిల్లలు భజన చేస్తూ వుండగా, మధ్యాహ్న భోజన ప్రసాదం నివేదన జరిగింది.

తిరిగి సాయంత్రం 6 గంటల హారతితో పూజ్యశ్రీ అమ్మగారి ఆరాధన ఉత్సవం మొదలయ్యింది. హారతి అనంతరం గురు పుత్రిక శ్రీమతి వేదమ్మగారు సత్సంగం చేసారు. "పూజ్యశ్రీ అమ్మగారిలో నాకు అద్భుతంగా కనిపించే విషయం 'కృతజ్ఞత' వారిలో విపరీతమైన కృతజ్ఞతా భావం ఉండేది. మనం బాబా నించి, మాస్టరుగారినించి, ప్రకృతి నించి ఎంత పొందుతున్నామో గమనిస్తే ఎంతో కృతజ్ఞతా భావం కలిగివుంటాము, అలా అనుక్షణం అమ్మగారు



గమనించు కుంటూ ఉండేవారు. అందుకే ఎప్పుడూ ఎంతో తృప్తితో కృతజ్ఞతతో ఉండేవారు. పూజ్యశ్రీ అమ్మగారి గురించి తెలియటం, ఆధ్యాత్మికత అర్థం అవ్వటం ఎంతో ముఖ్యమని నాకు అనిపిస్తుంది..

పూజ్యశ్రీ అమ్మగారిలో ఇంకొక అద్భుతమైన విషయం బాధ్యతతో ప్రవర్తించడం. ఇంటి బాధ్యతలే కాకుండా, ఆవిడ అనారోగ్యం వస్తే మందు తీసుకునే విషయంలో, పథ్యం చేసే విషయంలో ఎంతో బాధ్యతగా వుండేవారు. ఎప్పుడూ ఏమారి ఉండేవారు కాదు. అలాగే సేవ చేసినప్పుడు త్రికరణ శుద్ధిగా చేసేవారు. మనకి 'సాయిమాస్టర్ ప్రవచనములు' గ్రంథం అందుబాటులోకి తేవడానికి పూజ్యశ్రీ అమ్మగారు చాల కృషి చేసారు. పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందాక, వారు చేసిన ప్రవచనాలని ఎలా పడితే అలా రికార్డు చేస్తే వాటన్నింటిని చాలాసార్లు విని గ్రంథస్థం చేసారు. జిల్లెళ్ళమూడిలో చేసిన సేవ గురించి మనందరికీ తెలిసినదే. అలాగే ప్రతిరోజూ పూజ్యశ్రీ బాబా, మాస్టరుగారి పటాలను అలంకరించినప్పుడు, ఏదో ఒకలాగా చేద్దాంలే అనుకోకుండా ప్రతిరోజూ ఎంతో ఉత్సాహంతో కొత్తగా అలంకరించేవారు. పూజ్యశ్రీ అమ్మగారిని, అనసూయమాత, సుధీంద్ర బాబు గారు, గులాబ్ బాబా 'మహాత్ములు' అని కొనియాడారు. దత్త సంప్రదాయంలో గృహస్థు అయిన సద్గురువుంటే, గురుపత్నికి అత్యంత పవిత్రమైన స్థానం వుంటుంది. మనందరం పూజ్యశ్రీ మాస్టరుగారిని, పూజ్యశ్రీ అమ్మగారిని ఒకేరూపంగా చూడలేకపోతే, మాస్టరుగారి రూపంలో లభించిన మార్గదర్శకత్వానికి మనకి కృతజ్ఞత లేనట్లే. ఇకనుంచైనా మన వ్యక్తిగత భావాలు పక్కన పెట్టి వారిద్దరిని సమానంగా చూడటం దత్త సంప్రదాయాన్ని గౌరవించడం అన్న విషయం గుర్తుపెట్టుకుని వారిని మనందరం అనుసరిద్దాం" అని సత్సంగాన్ని ముగించారు.

తరవాత భజన జరుగుతూ ఉండగా రాత్రి అల్పాహార నివేదన జరిగింది. అనంతరం శేజ్ హారతి, కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలి, పవళింపుసేవలతో ఆరోజు కార్యక్రమాలు ముగిసాయి.

మర్నాడు 4వ తేదీ ఉదయం నిత్యసేవలన్నీ పూర్తయ్యాక శ్రీ ద్వారకబాబుగారు నిన్నటి సత్సంగానికి కొనసాగింపుగా మాట్లాడుతూ,,,,"మన శరీరానికి, మనస్సుకి మంచి తర్ఫీదునిచ్చి మన జీవితాన్ని నడిపించుకోవడం మన బాధ్యత! వాటికి ఎటువంటివి అలవాటుచేస్తే అవే అలవాటౌతాయి. బాబా మీద భావం కుదరాలంటే బాధ్యత మనమే తీసుకోవాలి. మనం శిరిడి వెళ్ళినప్పుడు యాత్ర బాగా జరిగితే మన గొప్పతనం, లేకపోతే అక్కడి కార్యనిర్వహణ, ధరల తీరు, ఇంకా ఎండలు ఇవన్నీ మనకు అడ్డు అనిపిస్తాయి. మనం బాధ్యతగా ప్రవర్తించడానికి తోడ్పడేవే హారతులు, పారాయణ, ప్రార్థన, ధ్యానాదులు. 'దానికోసం ప్రయత్నించి ఆ రుచి చూసిన వాడు దానిని వదలడు' అంటారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

ఈ ఆరాధన మహోత్సవ సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు ఇచ్చిన మార్గాన్ని హృదయపూర్వకంగా అనుసరించాలని నిర్ణయం తీసుకోవాలి. ఎవరి ఆధ్యాత్మికతకు వారే బాధ్యత వహించాలి" అని చెప్తూ, సత్సంగాన్ని ముగించారు. తరవాత సత్సంగ సభ్యులు జాజం శ్రీనివాసరావుగారి ఇద్దరు మనవరాళ్ళకి అక్షరాభ్యాసం, నామకరణం, చెవులు కుట్టించడం మొదలైన కార్యక్రమాలు పూజ్యశ్రీ అమ్మగారి సమక్షంలో, గురు పుత్రులు శ్రీ ద్వారక బాబుగారు, గురు పుత్రిక శ్రీమతి వేదమ్మగారు జరిపించారు. మధ్యాహ్న భోజన ప్రసాద నివేదనతో పూజ్యశ్రీ అమ్మగారి ఆరాధన మహోత్సవాలు దిగ్విజయంగా ముగిసాయి. ●

# మాతృదేవి స్మృతులు

**శ్రీ వెంపటి నరసింహం**

నాగోలు సత్సంగ సభ్యులు వెంపటి నరసింహంగారు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి తో వారికి గల అనుభవాలను, స్మృతులను ఈ విధంగా తెలియజేస్తున్నారు.

మేము మొట్టమొదట తిరుమలగిరిలో శ్రీమతి శారదా వివేక్ గారి ఇంట్లో జరిగిన వరలక్ష్మి వ్రతంలో పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకున్నాము. మాకు పూజ్యశ్రీ అమ్మగారిని మా అక్కయ్య శ్రీమతి ఇందిరా రావు గారు, మా బావగారు శ్రీ జి.వి.రావు గారు పరిచయం చేశారు. వరలక్ష్మి వ్రతానికి నేను, నా భార్య లక్ష్మి గచ్చిబౌలి నించి తిరుమలగిరికి బయలుదేరాము. ఆ ప్రాంతం మాకు కొత్త. మొదటిసారి వెళ్ళటం కనుక దారి కనుక్కోవటం కొంచం కష్టమైంది. ఆటో అతను చుట్టుపక్కల వీధులన్నీ తిప్పి చివరకు గమ్యానికి చేర్చాడు. మేము వెళ్లేసరికి పూజ్యశ్రీ అమ్మగారితో సహా అందరూ హాల్లో కూర్చుని వున్నారు. మేము వెళ్లిన వెంటనే వ్రతం మొదలయ్యింది. పూజ పూర్తయ్యాక పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకుని ప్రసాదం తీసుకున్నాము. అక్కడకి సైనిక్-పురి లో ఉంటున్న మా పెద్దక్కయ్య కూడ వచ్చింది. మాటల్లో "మీరు రావటానికి గంట ముందే, పూజ్యశ్రీ అమ్మగారు వచ్చేసారు. కానీ మీరు వచ్చేదాకా పూజ మొదలవ్వలేదు" అనిచెప్పింది. పూజ్యశ్రీ అమ్మగారిని అంతసేపు ఎదురుచూసేలా చేసినందుకు నాకు, లక్ష్మికి చాలా బాధ అనిపించింది. మనసులోనే క్షమాపణ చెప్పుకుని ఇంటికి బయలుదేరాము. తరవాత నాకు సాయి లీలామృతంలో "శ్యామా, ఆరతి కొంచెమాగి ప్రారంభించు, ఆ టాంగావాడు జాగు చేస్తున్నాడు" అన్న బాబా లీల గుర్తుకొచ్చింది.

ఇంక అప్పటినుంచి, మా కుటుంబం మొత్తం పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి వెడుతుండేవాళ్ళం. కొన్నాళ్లు చిక్కడపల్లి వెళ్ళాం, అక్కడనించి మల్కాజిగిరి వెళ్లే వాళ్ళం. ఒకసారి వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో, పూజ్యశ్రీ అమ్మగారి 60వ జన్మదినోత్సవం చేశారు. ఆరోజు నేను, మా అబ్బాయి కళ్యాణ్ మాత్రమే వచ్చాం. ఆడపిల్లలు, నా శ్రీమతి రాలేదు. ఫంక్షన్ పూర్తయ్యేసరికి రాత్రి పదకొండు గంటలయింది. పూజ్యశ్రీ అమ్మగారు నిలయానికి వెళ్ళాక, మేము ఒకనలుగురం ద్వారకబాబుగారితో కలిసి, ఫంక్షన్ హాల్లో వున్నాం. పూజ్యశ్రీ అమ్మగారి గురించి మాట్లాడుకుంటూ నేను "మేము యెంత రాత్రి గచ్చిబౌలి కి వెళ్లినా, వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పుకుని బయలుదేరితే చాలు, వారి దయవల్ల ఎలాంటి యిబ్బంది వుండదు" అని చెప్పాను. అప్పుడు బాబు గారు, "మీకు అమ్మగారిమీదఅంతనమ్మకంఉందా?" అన్నారు. "ఔను బాబు", అని చెప్పాను. కాస్సేపటికి అందరం మల్కాజిగిరికి వెళ్ళాము. అక్కడ పూజ్యశ్రీ అమ్మగారికి మనసులోనే నమస్కరించుకుని, గచ్చిబౌలికి బయలుదేరాము. అప్పుడు సమయం దాదాపు రాత్రి 12 గంటలు. మనవాళ్లెవరో వెడుతుంటే, వాళ్ళ వెహికల్ లో తార్నాక దాకా వచ్చాం. అక్కడ ఒక ఆటో దొరికింది. దాంట్లో రైల్వేస్టేషన్ కెళ్ళాం. అక్కడకి వెళ్ళగానే సెవెన్ సీటర్ వుంది. మెహదీపట్నం దాకా వెడుతుందంటే, అది ఎక్కి మెహదీపట్నం బస్సుస్టాప్ లో దిగాము. దాదాపు రాత్రి రెండు

గంటలు అయివుంటుంది. ఇప్పుడేమీ బస్సులు రావు, నామం చెప్పుకుంటూ, నెమ్మదిగా నడక మొదలుపెడదామని అనుకున్నాము. ఇంతలో దూరంగా బస్సు వస్తున్నట్లు అనిపించింది. ఆశ్చర్యంగా చూస్తున్నాను. బస్సురానే వచ్చింది. నేనూ, మావాడు బస్సెక్కాము. నాకు డౌట్ వచ్చి, "ఈ టైం లో ఇలా ఎందుకు వస్తున్నారు?" అని అడిగాను. డ్రైవర్ "ఈ బస్సు ఇంతకుముందు ఎప్పుడో చెడిపోయింది. ఇందాకే బాగయితే, డిపోకు తీసుకువెడుతున్నాను" అని చెప్పాడు. మేము బస్సు దిగి, ఇంటికి వెళ్లాక, మల్కాజిగిరి నించి గచ్చిబౌలి ప్రయాణం; బాబుగారు అడిగిన ప్రశ్న, అందులో పూజ్యశ్రీ అమ్మగారు మాకు చేసిన లీల- యివన్నీ తెల్లవారే వరకు ఇంట్లో అందరము చెప్పుకుంటూనే వున్నాము. నాకు సాయి లీలామృతంలో, నానా చాందోర్కర్ కి ఆరతి పాట, ఊదీ యిచ్చిరమ్మని, రామగిరిబువాని పంపించినప్పుడు, దారిలో అన్నీ సమకూర్చిన లీల గుర్తుకు వచ్చింది. పూజ్యశ్రీ అమ్మగారికి మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాము.

మా అబ్బాయి కళ్యాణ్ కి, ఒకసారి బాగా కడుపునొప్పి వచ్చింది. గురుబంధువుల సహాయంతో హాస్పిటల్ కి తీసుకువెళ్ళాము. వాడు బాగా మెలికలు తిరిగి పోతున్నాడు. వెంటనే స్కానింగ్ చేసారు. మిరియం గింజ అంత రాళ్లు రెండు కనిపించాయి. మేము వెళ్ళింది రాత్రి పూట కనక మర్నాడు కానీ స్పెషలిస్ట్ రారు. అందుకని మాతో డాక్టర్ గారు "ప్రస్తుతానికి



మందులు ఇస్తాను, యూరిన్ లో పడితే పడిపోతుంది. లేకపోతే రేపు ఆపరేషన్ చేసి తీసెయ్యవలసి ఉంటుంది" అని చెప్పారు. నాకు ఏం జరుగుతుందోనని భయమేసి, పూజ్యశ్రీ అమ్మగారికి సేవకుల ద్వారా విషయం విన్నవించుకున్నాము. "వాళ్లకి కట్టాల్సిన బిల్లు కట్టేసి రమ్మను, అంతే!" అని అమ్మగారు అన్నారని చెప్పారు. సరే ఏదైనా రేపేకదా చెయ్యాల్సింది, అనుకున్నాము. రాత్రంతా వాడికి కాపలా కాస్తూ వున్నాము, వాష్ రూంకి, వెడతాడేమోనని. ఒక్కసారి కూడా లేవలేదు. తెల్లవారి స్టాఫ్ అంతా వచ్చి, నన్ను అదే ప్రశ్న అడిగారు, అస్సలు లేవలేదని చెప్పాను. మళ్ళీ స్కానింగ్ తీశారు, వాళ్లంతా ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుంటున్నారు. కారణం, అందులో రాళ్లు కనిపించటం లేదు. మమ్మలిని చాలా ప్రశ్నలడిగి సాయంత్రం దాకా హడావిడి చేశారు. అపుడు నాకు అర్థం అయ్యింది, నిన్న పూజ్యశ్రీ అమ్మగారి మాటల్లోని అంతరార్థం. ఇక అక్కడ ఉండవలసిన అవసరం లేదని, అమ్మగారు సెలవిచ్చినట్లు, బిల్లు కట్టి బైటపడ్డాము. ఆపద్బాంధవాయై నమః అన్న నామం లో చెప్పినట్లు, పూజ్యశ్రీ అమ్మగారు, వాడిని పెద్ద ఆపదనించి కాపాడి మమ్మల్ని అనుగ్రహించారు.

పూజ్యశ్రీ అమ్మగారు నాగోలుకి వెళ్ళాక, మేము కూడా గచ్చిబౌలి నించి నాగోలుకి వచ్చేసాము. ఇక్కడకి వచ్చాక మా ఇద్దరి అమ్మాయిలకి పెళ్లిళ్లు అయ్యాయి. అందరం ఆ తల్లి చల్లని నీడలో హాయిగా వున్నాము. నాడు బాబాదగ్గర, మాస్టరుగారి దగ్గర జరిగిన లీలలు, నేడు పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర కూడా జరుగుతున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎటో కొట్టుకుపోవాల్సిన జీవితాలని, ఒక ఒడ్డుకుచేర్చి కంటికి రెప్పలా కాపాడుతున్న పూజ్యశ్రీ అమ్మగారికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను.

జై సాయి మాస్టర్!!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

*శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.*

## పదవ ప్రసంగము

### బ్రహ్మమునకు ఆత్మకు గల ఏకత్వాన్ని బోధించే వేదాంత మహావాక్యాలు

వేదాంతములోని జీవునికి బ్రహ్మమునకు వున్న అభేదాన్ని బోధించే వాక్యాలు మహావాక్యాలు. మహావాక్యాలు అనంతాలు. కానీ నాలుగు వేదాల నుండి ఒక్కొక్క మహావాక్యము ద్వారా గురువులు శిష్యులకు అభేదాన్ని బోధించారు. ఋగ్వేదంలోని ఐతరేయ ఆరణ్యకము నుండి 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనేది గ్రహించబడింది. యజుర్వేదములోనుంచి బృహదారణ్యకోపనిషత్తులో వున్న 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యము స్వీకరించబడింది. సామవేదంలోని ఛాందోగ్యోపనిషత్తులో వున్న 'తత్త్వమసి' అనే మహావాక్యం గ్రహించబడింది. అలాగే అధర్వణ వేదంలోని 'అయమాత్మా బ్రహ్మ' అనే మహావాక్యము తీసుకోబడింది.

**'ప్రజ్ఞానం బ్రహ్మ'** అనే మహావాక్యములో ప్రజ్ఞానము, బ్రహ్మ అనే రెండు పదాలు వున్నాయి. ప్రజ్ఞానమంటే చైతన్యము. ఈ చైతన్యము అన్ని ఇంద్రియాలలో యిమిడి వున్న అంతఃకరణ వృత్తులతో కూడివున్నది. దేవ, మనుష్య, దానవ, అశ్వ, గవాది (దేవ, మనుష్య, దానవ, గుర్రము, ఆవు మొదలైన) శరీరాలను ధరించిన వాటిలోనూ, ఆకాశము మొదలైన ఆదిభూతాలలోనూ, జగత్తు యొక్క జననము మొ॥న వాటికి కారణమైన చైతన్యము బ్రహ్మ పదార్థము. ఆ ప్రజ్ఞానమే బ్రహ్మము (అది నేనే).

**'అహం బ్రహ్మాస్మి'** అనే వాక్యంలో అహం, బ్రహ్మ, అస్మి అనే మూడు పదాలు వున్నాయి. పరమాత్మ అన్ని విధాలా పరిపూర్ణుడు; సహజ స్వభావసిద్ధంగా దేశకాల వస్తువుల చేత విభజింపబడనివాడు. మాయ చేత పరికల్పితమైన ప్రపంచంలో విద్యాధికారి, శమము మొ॥న సాధనాసంపన్నుడు, శ్రవణము మొ॥నవి అనుష్ఠించినవాడు అయిన మానవుని చేత శరీరాలలో బుద్ధితో కూడి వున్న సూక్ష్మశరీరానికి సాక్షి. ప్రకాశతత్వము మొ॥న గుణాలను ఆధారంగా చేసుకొని అహం అనే పదానికి సాక్షి అనే అర్థం చెప్పవచ్చు. అస్మి అనే పదంతో అహం, బ్రహ్మ అనే పదాలు సమానాధికరణాలు. (అంటే రెండు పదాలు ఒకే వస్తువులు

తెలుపుతాయి) కావడం వలన జీవ బ్రహ్మ ఐక్యము తెలుస్తుంది. కాబట్టి 'నేను సాక్షి స్వరూపుడనైన బ్రహ్మాన్ని' అని ఈ మహావాక్యానికి అర్థము.

'**తత్త్వమసి**' అనే మహావాక్యంలో 'తత్, త్వం, అసి' అనే మూడు పదాలు వున్నాయి. స్వగతము మొ॥న భేదాలు లేని (స్వగత భేద శూన్యము) – అంటే భగవంతుని శరీరంలోని అన్ని అంగాలు మిగిలిన అన్ని అంగాల పని చేయగలవు. అంటే భగవంతుడు తన శరీరంలోని అన్ని అంగాలతోనూ చూడగలడు, వినగలడు, మాట్లాడగలడు, వాసన చూడగలడు, తినగలడు, ఆలోచించగలడు. అందుకే భగవంతుని యొక్క అన్ని అంగాలు ఆయనకు అభేదాలే. నామరూప రహితము, సృష్టికి ముందు తరువాత కూడా వుండేది, లక్షణాల చేత ప్రతిపాదింపబడనది అయిన సద్వస్తుసమచైతన్యమే (ఏదైతే వున్నదో అది – విశ్వచైతన్యం అనేది) తత్ పదార్థము.

శ్రవణము మొ॥న అనుష్ఠానాల ద్వారా మహావాక్యాల అర్థాన్నిగ్రహించేది, శరీరంలోని ఇంద్రియాలకు భిన్నమైనది, దేహములోని ఇంద్రియ ఉపలక్షితము, శరీరత్రయ★★ సాక్షి అయిన (మూడు శరీరాలు – శరీరత్రయం – (1) స్థూల శరీరం, (2) సూక్ష్మ శరీరం, (3) కారణ శరీరం. వీటికి సాక్షి అయిన) సద్వస్తు రూప చైతన్యమే (భగవంతుని స్వరూపమైన మనలోని పరిమితమైన ఆత్మ) 'త్వం' అనే పదానికి లక్ష్యార్థము (పరంపరతో కూడుకున్నది).

మహావాక్యములోని లక్షణ చేత 'తత్, త్వం' పదాల యొక్క సమానాధికరణ (రెండు పదాలు ఒకే దానిని తెలపడం) వలన లభించే రెండు పదార్థాల ఐక్యము ప్రవచన రూపమైన మహావాక్యార్థము.

'**అయమాత్మా బ్రహ్మ**' అనే మహావాక్యంలో మూడు పదాలు వున్నాయి. అయమ్, ఆత్మ, బ్రహ్మ. అయం పదము చేత అపరోక్షము స్వయంప్రకాశము అయిన బ్రహ్మము తెలుసుకోబడుతుంది. ఆత్మ శబ్దము చేత అహంకారం, ప్రాణము, మనస్సు, ఇంద్రియాలు, దేహము మొ॥నవి వీటికి భిన్నమైనది వాటన్నింటికీ ప్రత్యగధిష్ఠానము (ప్రత్యగాత్మ## అనే భ్రాంతి స్థితిలో అధిష్ఠానముగా వున్నది ఒకే ఒక ఆత్మ), సాక్షి అయిన అంతరాత్మ తెలిసికోబడుతుంది. ఈ మహావాక్యము ఆత్మ శబ్దార్థాన్ని నిర్వచిస్తుంది. ఆకాశము మొదలైన సర్వ జగత్తుకు అధిష్ఠానమైనది, సర్వానికి బాధావశేషము, పరమార్థయుక్తమైన సచ్చిదానందస్వరూప చైతన్యము బ్రహ్మపదార్థము.

## నిష్కామ కర్మతోపాటు మహావాక్య విచారము చేత జ్ఞానోదయము

ఈ ప్రకారము బ్రహ్మనిష్ఠుడు, బ్రహ్మశ్రోత్రియుడు అయిన మహాత్ముని ద్వారా మహావాక్యవిచారము చేయడం వలన ఆవరణ దోషాన్ని (అజ్ఞానపు పొర) నాశనం చేసేటటువంటి అపరోక్ష జ్ఞానం కలుగుతుంది. స్వరూప సాక్షాత్కారము అయిన జ్ఞానికి శ్రవణ, మనన, నిధిధ్యాసలు అవసరంలేదు. వామదేవుడు మొ॥న ఋషులకు స్వరూప భ్రాంతి లేకపోవడం వలన శ్రవణాదుల పట్ల ఆసక్తి లేదు. దృఢమైన అపరోక్ష జ్ఞానం వారికి కలగడం వలన వారు శ్రవణాదులలో ఆసక్తి లేకుండా వుండడానికి యోగ్యమైనవారు. కానీ దృఢమైన అపరోక్ష జ్ఞానము కలుగనంత వరకు ముముక్షువు శ్రవణము మొ॥న వాటిని సేవించి దృఢమైన అపరోక్షనుభూతిని పొందాలి. ఆ విధంగానే మలదోషం తొలగడం కోసం నిష్కామకర్మను ఆచరించాలి. పూర్వజన్మలో నిష్కామకర్మ ద్వారా మలదోషాన్ని (మన మానసిక, శారీరిక మాలిన్యాలు) పోగొట్టుకొని జన్మించినవారు కూడా ఈ జన్మలో మలదోషము కలుగకుండా నిష్కామకర్మ చేయాలి.

***మిగతా 29వ పేజీలో***

---

*★★ శరీరత్రయము (మూడు శరీరాలు)*

*1. స్థూల శరీరము: కాళ్లు, చేతులు, కళ్ళు, నోరు, ముక్కు, చెవులు, చర్మం.*

*2. సూక్ష్మ శరీరము: 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు, 5 ప్రాణాలు, 4 అంతకరణాలు (లింగ శరీరం).*

*3. కారణ శరీరము: 'దేహేంద్రియాలే నేను' అనే విపరీత భావనలో కూడిన అజ్ఞానాన్నే కారణ శరీరం అన్నారు. దీని నుంచే స్థూల, సూక్ష్మ శరీరాలు వస్తాయి.*

*## ప్రత్యగాత్మ: ప్రాణుల హృదయములో చలిస్తూ అంతఃకరణ రూపంలో వారి కర్మలన్నింటిని అనుభవింపజేసే ప్రేరణశక్తి కలదై, తాను మాత్రం సాక్షీభూతమై, అసంగమై వుండేది.*

(గత సంచిక తరువాయి)

# మరికొందరు భక్తులు


పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

### మోడక్ :

మోడక్ 1907లో ఉద్యోగం కోసం ధూలియా వెళ్ళినపుడు అతని స్నేహితుడు బాలాసాహెబ్ భాటే మొదటిసారిగా అతనికి సాయి గురించి చెప్పాడు. అతడు పైకి దర్శించాలన్న ఆసక్తిని ప్రకటించాడేగాని, నిజానికి విషయమై అతడే మాత్రమూ శ్రద్ధ వహించలేదు. ఆ తర్వాత కొద్దిరోజులకే భాటే ధూలియాలో తన వుద్యోగానికి రాజీనామా యివ్వదలచాడు. ఆ రోజులలో అతని ముఖవర్చస్సులో తీవ్రమైన వైరాగ్యం ప్రస్ఫుటమవుతుండేది. అపుడు మళ్ళీ మిత్రులిద్దరూ కలుసుకున్నారు. అపుడు బాలాభాటే సాయిని దర్శించమని మోడక్ తో మళ్ళీ చెప్పాడు. తర్వాత కొద్దిరోజులలోనే మోడక్ ప్రభుత్వ పనిమీద సంగమనేర్ వెళ్ళవలసి వచ్చింది. అక్కడ ఆ పని పూర్తికాగానే అతనికి శిరిడీ వెళ్ళాలన్న ప్రేరణ కలిగింది. అతడు కోపర్గావ్ చేరి తన మిత్రుడు మీరీకర్ ను కలుసుకున్నాడు. అక్కడ బాలభాటే, మరొక మిత్రుడు తోడయ్యారు. ఆ ముగ్గురూ ఒక్కొక్కరూ ₹2/-లు చొప్పున బాబాకు దక్షిణగా సమర్పించాలని వేరుగా పెట్టుకుని మిగిలిన పైకం ఖర్చులకుంచుకుని శిరిడీ చేరారు. అటుతర్వాత విషయం మోడక్ ఇలా చెప్పాడు : "మేము శిరిడీచేరి బాబాకు ఒక్కొక్కరమూ కొబ్బరికాయ, అగరువత్తి సమర్పించాము. బాబా నాకళ్ళలోకి చూస్తూ, 'నాకేమైనా దక్షిణ యిస్తావా?" అన్నారు. నేను ₹.2/-లు సమర్పించాను. తర్వాత ఆయన నామిత్రుణ్ణి గూడ అడిగారు. అతడు ₹.1/- మాత్రమే ఇచ్చాడు. బాబా నవ్వి, 'మనుషులెంత మోసగాళ్ళు! మొదట ₹2/- లు ఈ ఫకీరుకు దక్షిణగా సమర్పించాలని వేరుగా వుంచుకుంటారుగాని, తర్వాత ₹1/- మాత్రమే సమర్పిస్తారు! వేరే జేబులో నీ ఖర్చులకు చాలినంత వున్నదిగదా!' అన్నారు. నా మిత్రుడు సిగ్గుపడి మరో రూపాయి సమర్పించాడు. అపుడు బాబా మమ్మల్ని వాడాకు పొమ్మన్నారు. మాకు వాడా ఎక్కడుందో తెలియక భక్తులనడిగితే వారు మాకు సాఠేవాడా చూపించి, 'అక్కడొక వేపచెట్టున్నది; దానికి ప్రదక్షిణం చేసుకో' అన్నారు. మేమలాగే చేశాము. అప్పుడక్కడ బాలాసాహెబ్ వున్నాడు. అతడు మమ్మల్ని చూచి ఎంతో సంతోషించి, 'చివరికెలాగో, బాబా నిన్ను రప్పించుకున్నారే?' అన్నాడు. తర్వాత కొంత సమయం సంతోషంగా గడిపి బాబా అనుమతితో మేము కోపర్గావ్ తిరిగి వచ్చేశాము.

అదే సంవత్సరం డిశెంబర్ లో క్రిస్మస్ సెలవులకు నేను సకుటుంబముగా ఖాండేష్ వెళ్ళవలసి వున్నది. మావాళ్ళందరూ దారిలో సాయిబాబాను దర్శించాలని కోరారు. మేము కోపర్గావ్ చేరి, మీరీకర్ యింట్లో బసచేసాము. మేము శిరిడీ వెళ్ళదలచామని చెప్పగా, అతడే మాకు టాంగా ఏర్పాటు చేసాడు. 'బాబాను దర్శించి భోజనానికి మళ్ళీ యిక్కడికే రండి!' అన్నాడు.

మా జట్కా శిరిడీలో ప్రవేశించే సమయానికి బాబా లెండీకి వెళ్తూ మాకెదురయ్యారు. మేమందరమూ బండ్లుదిగి ఆయనకు నమస్కరించుకున్నాము. ఆయన, "మీరంతా గ్రామంలోకి వెళ్ళండి. నేను కొద్ది సేపట్లో వస్తాను" అన్నారు. మేము భాటే యిల్లు చేరేసరికి, అక్కడ దాసగణు, శ్యామా వున్నారు. కొంత సేపయ్యాక అందరమూ కలసి మశీదు కెళ్ళాము. నేను 'షేరా', పండ్లు బాబాకు సమర్పించాను. ఆయనొక బత్తాయిపండు తీసుకొని మాక్కొంచెం



ప్రసాదమిచ్చి, మిగిలినది అందరికీ పంచారు.

ఆ తర్వాత మా అందరినీ కొద్దిరోజులు శిరిడీలో వుండవలసిందిగా భాటే కోరాడు. మరలా బాబాను దర్శించినపుడు ఆయన మాకు ఊదీ యిచ్చారు. శ్యామా, 'వీళ్ళందరు ఇక్కడ వుండాలా, లేక వెళ్ళిపోవాలా?' అని బాబాను అడిగాడు. అప్పుడు బాబా, 'అరే, వాడు భార్యాపిల్లలతో వచ్చాడు! ఉపాహారం మాత్రంచేసి వెళ్ళమను. పాపమక్కడ సాహెబ్ వీళ్ళకోసం వేచివుండి వీధిని చూస్తుంటాడు' అన్నారు. మీరీకర్ ను గురించి బాబా ఎప్పుడూ 'సాహెబ్' అని వ్యవహరిస్తారని తర్వాత తెలిసింది. బాబా సర్వజ్ఞులని తెలిసింది.

ఇంతలో ఎవరో వ్యక్తి మశీదులో కొచ్చి ఒక మూల కూర్చున్నాడు. భక్తులిచ్చిన ప్రసాదం అందరికీ పంచుతూ ఆ వ్యక్తిని ప్రత్యేకంగా పిలిచి ప్రసాదమిచ్చారు బాబా. మరొక వ్యక్తికి ఊదీ మాత్రం యిచ్చారుగాని, ఆశీర్వదించలేదు. ఇంతలో ఆయన ఒక ముస్లిమును 'ఫాతిహా' చదవమన్నారు. ఆయన ఏది ఎందుకు చేస్తారో నాకర్థం కాలేదు.

అక్టోబర్ 1910లో నేనొక ముఖ్యమైన ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్ళవలసి వున్నది. ఒక గురువారం నాడు నేను కోపర్గావ్ లో దిగి, బాబా దర్శనం చేసుకొని బొంబాయి వెళ్ళాలనుకున్నాను. ఒక మిత్రుడికీ సంగతి తెలిసి, నేను తప్పక మన్మాడ్ లో ఒకరోజు అతనితో గడిపి వెళ్ళాలని జాబు వ్రాశాడు. నేననుకున్న ప్రకారం శిరిడీచేరి సాయికి నమస్కరించగానే ఆయన, "ఇతనిక్కడకొచ్చి చాలా రోజులయింది. ఇతనిప్పుడు చాలా ఖర్చులో వున్నాడు' అన్నారు. భోజనమయ్యాక ఆయనవద్ద సెలవు తీసుకోవడానికి మరలా దర్శించాను. శుక్రవారం రాత్రి మన్మాడ్ లో మిత్రునివద్ద ఆగి మర్నాడు బొంబాయి వెళ్ళాలని నా సంకల్పం. అలా అనుకోగానే ఆయన నాకేసి చూచి, 'ఏమంత తొందర! అతనక్కడలేడు' అన్నారు. నాకేమీ అర్థంగా లేదు గాని, ఆ పూటకు ఆగిపోయాను. బాబా మాటలకర్థమేమో తర్వాత తెలిసింది. కలెక్టర్ వద్దనుండి టెలిగ్రాం రావడంవలన మన్మాడ్ లో నా మిత్రుడు అకస్మాత్తుగా నాసిక్ వెళ్ళాడు. నేను తప్పక శుక్రవారం బొంబాయిచేరి సోమవారం వరకూ అక్కడుండవలసి వున్నది. కాని బాబా, 'నీవు ఆదివారం వరకూ బయలుదేరవద్దు' అన్నారు. నేను ప్రయాణం మానుకున్నాను.

ఆ తర్వాత నేను, నూల్కర్, దీక్షిత్ కలసి పొలాల్లోకి బహిర్దేశానికని వెళుతున్నాము. అప్పుడు వారిద్దరూ, "నీకు బాబాపై విశ్వాసమున్నదా? ఆయన నిన్నిప్పుడు బొంబాయి వెళ్ళటానికనుమతించలేదు కదా! నీకు అత్యవసరమైన పని వున్నదికదా! దానిసంగతేమి చేయదలచుకున్నావు?' అన్నారు. 'నాకు బాబాపై పూర్తి విశ్వాసమున్నది. ఆయన నా మంచి కోసమే నన్ను ఆపారనుకుంటున్నాను' అన్నాను. తర్వాత నేను మశీదులో కూర్చున్నపుడు బాబాతో శ్యామా, 'దేవా, బొంబాయిలో అతనికవసరమైన పనివున్నది గదా! అతడు వెళ్ళడానికి మీరనుమతించరేమి?' అన్నాడు. బాబా, 'వాడేమన్నా నీ యింటికొచ్చాడా? ఆ సంగతి నీకెందుకు?' అని నావైపు తిరిగి, 'నీవేమీ ఆందోళనపడకు!' అన్నారు. అలానే శుక్రవారం నుండి మంగళవారం వరకూ గడిచింది. నాటి సాయంత్రం నేను నమస్కరించగానే, బాబా నా శిరస్సు నిమిరి, 'నువ్వు ఊదీ తీసుకొని వెళ్ళదలచుకుంటే యిక

వెళ్ళవచ్చు' అన్నారు. నేను ఊదీ ఆయన చేతిలోపోస్తే అది నా నొసట ఆయనే పెట్టారు. నేను లేచి మశీదునుంచి ఒక మెట్టు దిగానో లేదో ఆయన, నీవీ రోజు వెళ్ళవద్దు. కాలంతా నొప్పిగా వున్నది. రేపు వెళ్ళు' అన్నారు. నేను మళ్ళీ ఆయనచెంత పాదాలొత్తుతూ కూర్చొన్నాను. తర్వాత సాఠేవాడాలో మేమంతా మాట్లాడుకుంటూ కూర్చున్నాము. ఒకనాటి రాత్రి తాత్యాసాహెబ్ చిలిం సిద్ధంచేసి పొగత్రాగనారంభించాడు. అదిచూచి నేను, "నీకీ చిలింగొట్టమెక్కడిది?' అనడిగితే తనకు బాబా యిచ్చారని చెప్పాడు. 'అయితే యిది సాయి ప్రసాదంగా నాకివ్వు' అన్నాను. 'ఇదెందుకు? నీక్కావాలంటే బాబానడిగే తీసుకో' అన్నాడతడు.

మరురోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో నేను మశీదుకు వెళ్ళి కూర్చున్నాను. బాబా నాకేసి చూచి, వెంటనే ఆ ప్రక్కగా వెళ్తున్న కుమ్మరిని పిలిచి, 'నాకు వెంటనే చిలిం గొట్టాలు కావాలి!' అన్నారు. అతడు వెళ్ళగానే బాబా, 'శ్యామా! మశీదులో ఆ మూలనున్న రెండు చిలిం గొట్టాలివ్వు!' అని వాటిని తీసుకొని అటు యిటూ త్రిప్పిచూచి, వాటిని నాకిచ్చి, 'వీటిని నా ప్రసాదంగా దాచుకో' అన్నారు. నేనడుగకనే, నేను కోరినది ఒక చిలిమ్ గొట్టమయితే; ఆయన రెండు ప్రసాదించడం చూచి ఆశ్చర్యపోయాను.

మరురోజు, అంటే బుధవారం తెల్లవారుఝామున, నాకు కల వచ్చింది. నేనింటివద్దనున్నాను. 11/2 సం॥ల వయస్సుగల నాపాప నన్ను పిలుస్తున్నది. నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని సామాను సర్దుకొని బాబావద్దకు మశీదుకు వెడుతూంటే దీక్షిత్, నూల్కర్లు నన్నుచూచి నవ్వుతూ, "ఏమిటి సామానంతా సర్ది మంచి దుస్తులేసుకున్నావు? నీవు ప్రయాణమవడానికి బాబా అనుమతించకపోతే ఏం చేస్తావు?" అన్నారు. నాకొచ్చిన స్వప్నం దృష్ట్యా ఆయన అనుమతిస్తారని నాకు తెలుసునని చెప్పాను. సరిగ్గా 8-30 ని॥లకు అందరమూ మశీదు చేరాము. ఆ సమయంలో బాబా తీవ్రమైన కోపంతో మశీదు ముంగిట పెద్దగా కేకలేస్తూ, తిడుతూ అటు ఇటూ తిరుగుతున్నారు. మేము నివ్వెరపోయి అక్కడే నిలబడ్డాము. ఆయన కొద్ది సేపటికి శాంతించి తమ ఆసనంపై కూర్చున్నారు. మేము మశీదు ప్రవేశించి నమస్కరించగానే ఆయన నాతో 'ఉదీ తీసుకొని త్వరగా బయలుదేరు, నీ బిడ్డ నీకోసమెదురు చూస్తున్నది. ఈ కాకా(దీక్షిత్), తాత్యా వట్టి వెధవలు. నిన్ను భోంచేసి బయల్దేరమని వాళ్ళు పట్టుబడతారు. నీవు వాళ్ళ మాటలు వినక వెంటనే బయల్దేరు' అని చెప్పి, శ్యామాతో, 'నీవు కోపర్గావ్ వరకూ తోడుగా వెళ్ళు' అన్నారు. నేను బాబాను చివరిసారిగా 1916లో దర్శనం చేసుకున్నాను".

## శ్రీమతి కాశీబాయి :

కామధేనువు, కల్పవృక్షము, చింతామణుల కంటె గూడ సద్గురువు అధికుడని 'శ్రీ గురుచరిత్ర" చెబుతుంది. భక్తులకు ఆ మూడూ ప్రసాదించగలవి మాత్రమేగాక అవేవీ ప్రసాదించలేని అతీతశక్తిని గూడ ఆయన ప్రసాదింగలడమే యిందుకు కారణమని చెబుతుంది. ఈ విషయం శిరిడీకి చెందిన శ్రీమతి కాశీబాయి అనే తల్లి విషయంలో మనం చూడవచ్చు.

స్వతహాగా కాశీబాయి పుట్టి పెరిగినది శిరిడీలోనే. కాని వివాహమయ్యాక ఆమె నీఫాడ్ లోని తన భర్తయింటికి వెళ్ళింది. దురదృష్టవశాత్తు కొద్ది సం॥లకు ఆమె భర్త మరణించాడు. అతడు మరణించేనాటికి ఆమె గర్భవతి. తర్వాత సకాలంలో ఆమెకు మగబిడ్డ జన్మిస్తే అతడికి 'మాధవ్' అని పేరు పెట్టుకున్నది. బిడ్డకు సం॥ నిండాక ఆమె పుట్టింటికి తిరిగివచ్చి, శిరిడీలోనే తన తల్లిదండ్రుల వద్ద నివసించసాగింది.

ఆమెది నిరు పేదకుటుంబం; రెక్కలాడితేగాని డొక్కలాడేవిగావు. ఆమె రోజంతా పొలంలో పనిచేస్తేగానీ కడుపు నిండేదిగాదు. కాని సం॥ నిండిన బిడ్డను పెట్టుకుని ఆమె పనిలోకి ఎలా వెళ్ళగలదు? వాణ్ణి యింట్లో విడిచివెడితే పగలంతా చూచుకోగలవారెవరూలేరు. చివరికామెకు తోచిన ఉపాయమొక్కటే. ఆ ప్రకారమే ఆమె రోజూ తన బిడ్డను ఉదయాన్నే మశీదుకు తీసుకువచ్చి, అక్కడొక మూల కూర్చోబెట్టి పొలం పనికి వెళ్ళిపోయేది, సాయంత్రం పనిలోంచి వస్తూనే ఆమె మశీదుకు వెళ్ళి బిడ్డను తీసుకుని యింటికి వచ్చేది. ఇలా ఆమె ఎన్నిరోజులు చేసినా ఒక్కసారి గూడ ఆమెకుగాని, ఆ పసిబిడ్డకుగానీ ఎట్టి యిబ్బందీ కల్గలేదు. పేరుకు మాత్రమే ఆమె అతడికి తల్లిగాని, నిజానికి అతడికి తల్లి-తండ్రి-తోడు-నీడ సాయిబాబాయే. ద్వారకామాయియే

అతని ఇల్లు. ఎన్ని జన్మల పుణ్యంవల్లనోగాని అతనికంతటి భాగ్యం లభించింది. ఇలా 4,5 సం॥లు గడిచిపోయాయి. మాధవ్ కు 5వ యేడు వచ్చినప్పటినుంచీ బాబా అతనికి నిత్యమూ ఒకరూపాయి యివ్వనారంభించారు. మాధవ్ గూడ తన శక్తి కొద్దీ బాబాకు చిన్న చిన్న పనులు చేసి పెడుతుండేవారు.

మానవ నైజం చాలా చిత్రమైనది. మొదట కాశీబాయి తాను పొలంపని చేసుకొచ్చేవరకూ తన బిడ్డకు అండవుంటే చాలనుకున్నది. కాని ఆమె ఆశించకున్నా, కోరకున్నా, తమకై తామే సాయి నిత్యమూ తన బిడ్డకు రోజూ రూపాయి యివ్వనారంభించగానే మానవ సహజమైన దురాశ ఆమెలో పడగవిప్పింది. ఒకనాడామె మశీదుకొచ్చి బాబాతో, "బాబా, మీరు నిత్యమూ కొందరికి ₹.50/-లు, కొందరికి ₹.30/-లు, మరి కొందరికి ₹.25/-లు, యిలా వుదారంగా డబ్బిస్తున్నారు గదా, నాబిడ్డ మీకు నిత్యమూ ఎన్నో పనులు చేసి పెడుతున్నా గూడ వాడికి రోజుకు ఒక్క రూపాయి మాత్రమే యిస్తున్నారేమి?" అని అడిగింది. ఆమె తనకు తెలియకుండానే అవ్యాజమైన వారి అనుగ్రహాన్ని క్షుద్రమైన వేతనంగా మార్చుకుంటోంది. బహుశా మనమందరమూ అంతేనేమో! బాబా, "అమ్మాయీ, నేను యితరులకు ఎక్కువ పైకమూ, నీ బిడ్డకు తక్కువ పైకమూ యిస్తున్నమాట నిజమే. కాని ఒక్క విషయం గుర్తుంచుకో! ఇతరులకు ఏదో ఒకనాడు పైకం యివ్వడం నిలిపివేస్తాను. కాని నీబిడ్డకు మాత్రం ఎల్లకాలమూ యిస్తుంటాను. నీలా దిక్కులేనివారికి నేనే దిక్కు గదా!" అన్నారు.

బాబా మాటలు కాశీబాయికి సరిగా అర్థంకాలేదు. మానవ హృదయంలోని ఆశ - అవ్యాజమైన ప్రేమను గుర్తించనీయకుండా చేస్తుంది గాబోలు. తాను ఆశించినంత పైకము వెంటనే ఆయన యివ్వలేదనే ఆమె ఆలోచించింది గాని, నిజానికి ఆయన తన బిడ్డకిస్తున్నది తుచ్ఛమైన డబ్బు మాత్రమేగాదని, భక్తులను ఎల్లకాలమూ కాపాడగల ప్రసాదమనీ ఆమె గుర్తించలేదు. ఆయన కలవాళ్ళకే అన్నీ ఎక్కువగా యిచ్చివేస్తున్నారని, తనవంటి దీనురాలికి అతిస్వల్పంగా మాత్రమే యిస్తున్నారనీ కొలతలు వేసుకున్నది. ఆయన చెప్పిన మాటలు సరిగా వినిపించుకోకుండా, "అయ్యా, నాభర్త ఎప్పుడో 5 ఏండ్ల క్రిందట చచ్చిపోయాడు, అప్పటినుండి నాకే ఆధారమూ, దిక్కులేదు" అని వలవలా ఏడ్వసాగింది.

అన్ని సం॥లు ఆయనవద్ద ఆమె బిడ్డ అనుభవించిదేమిటో? ఆశకంతేమున్నది? అదిచూచి సాయి ఉగ్రులై పెద్దగా కేకలేయనారంభించారు. ఆమె వెంటనే మశీదు నుండి యింటికి చేరుకున్నది. అంతేకాదు - నిత్యమూ రావడం గూడ మానుకున్నది. మనలో ఎక్కువమందిమి అలానే చేస్తున్నాము. మనం కోరకనే ఆయన ఎన్ని ప్రసాదించినా మనమడిగినది ఏదో ఒకటి నెరవేర్చలేదని ఆయనపై అలుగుతాం. కాని నష్టమెవరికి? కొద్దిరోజుల తర్వాత బాబా ఆమెను స్మరించి ఆమెకు కబురు పెట్టారు - ఏనాటికైనా మనను తిరిగి రప్పించుకోవలసింది ఆయనే. మాధవ్ ను తోడు తీసుకుని కాశీబాయి మశీదు కొచ్చిందిగాని, సాయితో ఏమీ మాట్లాడటానికి ధైర్యంచాలక మౌనంగా నిలబడింది. బాబా ఆమెతో ఎంతో సౌమ్యంగా, లాలనగా మాట్లాడారు.

అప్పట్లో బాబాకు కొన్ని పండ్లు కదులుతుండేవి. ఆయన అకస్మాత్తుగా తమ పన్నొకటి పీకి, దానిని కొద్ది ఊదీతోపాటు చిన్నగుడ్డలో చుట్టి ఆమెకిచ్చి, దానిని భద్రంగా దాచుకొమ్మని, ఆమెకదెంతో మేలుచేయగలదనీ చెప్పారు. సాయికి వారి గురువు ఒక ఇటుక మాత్రమే ప్రసాదించారు. సాయి తమ భక్తురాలికి తమ శరీరంలో భాగమైన ఆ పన్ను పీకి ప్రసాదంగా ఇచ్చారు. వారి ఆశీస్సులవలె అది ఎన్నటికీ చెడిపోనిది. దానిని తాయెత్తులో పెట్టించి మాధవ్ జబ్బకు కట్టిందామె. మాధవ్ పెద్దవాడై తన తల్లి మరణించాక నీఫాడ్ లో స్థిరపడ్డాడు. ఒకసారి అతడు ప్రమాదమైన జబ్బుచేసి మంచాన వుండగా ఒకనాడు బాబా కలలో కనిపించి, "త్వరలో నీవద్దకొక వ్యక్తి వస్తాడు; అతడికి నీ జబ్బమీద కట్టుకున్న తాయెత్తు తీసియివ్వు" అని చెప్పారు. అదేరోజు ఒకప్పుడు శిరిడీలో అతనికి పరిచయమైన 'నికామ్' అనుభక్తుడు పూణే నుంచి వచ్చాడు. అతనికి గూడ ఆ తాయెత్తు తీసుకొమ్మని స్వప్నంలో బాబా చెప్పడం వలన అతనికిచ్చేశాడు మాధవ్. అది యిప్పుడు శివాజీ నగర్ పూణేలోని 'సద్గురు సాయినాథ్ మందిర్' లో వున్నది. జూలై 12, 1961లో పాన్షెట్ డామ్ పగిలి, నీటి వరదలో నగరమంతా 20 అడుగుల లోతు నీటిలో మునిగిపోయింది. ఆ నీరు తీసేశాక భక్తులు రెండు మూడు రోజులు శ్రమించి ఆ మందిరంలో పేరుకుపోయిన బురదంతా తొలగించిచూస్తే, అందులోని సాయిబాబా చిత్రపటం చెక్కు చెదరకుండా అలాగే వున్నది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

*శ్రీమతి శ్రీదేవి*

బాహ్యదృష్టితో చూస్తే శ్రీ భోలానాథ్ గారు ప్యారీబానుగారి తోటలో ఒక ఉద్యోగి మాత్రమే. అయితే ప్యారీబాను ఆయనను తన క్రింది ఉద్యోగిగా ఎన్నడూ చూడలేదు. ఆమె అమ్మను, భోలానాథ్ గారిని సాక్షాత్తు దైవ స్వరూపులుగా భావించి ఆరాధించేది. తన పిల్లల వివాహాల సందర్భంగా అమ్మను ఆహ్వానించిన ప్యారీబాను అమ్మకు కలకత్తాలో ఒక వసతి గృహాన్ని ఏర్పాటు చేసి కొంతకాలం కలకత్తాలోనే వుండవలసిందిగా వేడుకొనడంతో అమ్మ చాలా రోజులు కలకత్తాలో వుండిపోయారు. అక్కడ వున్నన్ని రోజులు ప్యారీబాను ప్రతిరోజు అమ్మను తన గృహంలో పూజించి విందు భోజనాలతో సత్కరించేది.

ప్యారీబాను కుటుంబంలో ఆస్తి తగాదాలు వున్నాయి. ఒకరోజు ప్యారీబాను అమ్మతో "అమ్మా, మా కుటుంబంలో వున్న తగవుల మూలంగా ఎన్నో ఏండ్లుగా మా అత్తగారు మా ఇంటికి రావడం లేదు. ఇప్పుడు మీ అనుగ్రహంతో ఆమె మా ఇంటికి రావడం జరిగింది. ఈ సందర్భంగా నేను మిమ్మల్ని మా ఇంటికి విచ్చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మీ సమక్షంలో మా కుటుంబ సభ్యులందరము కలిసి కూర్చొని, మా సమస్యలను పరిష్కరించుకోవాలని వున్నది" అన్నది. అమ్మ అంగీకరించి ప్యారీబాను గృహానికి వెళ్లారు. అక్కడ అమ్మ సమక్షంలో వారంతా చర్చలు జరుపుకున్నారు. ఎంతో ఆశ్చర్యకరంగా ఆ కుటుంబంలోని సమస్యలన్నీ సామరస్యంగా పరిష్కారమైనాయి. ప్యారీబాను ఆనందానికి అవధులు లేవు. ఆమె ఎంతో సంతోషంతో అమ్మకు కృతజ్ఞతలు తెలుపుకున్నది.

ప్యారీబాను అత్తగారు ఢాకాలో వుంటుంది. పిల్లల వివాహం తర్వాత కొడుకు-కోడలు, కూతురు-అల్లుడులను వెంటబెట్టుకొని ప్యారీబాను ఢాకాలోని అత్తగారి వద్దకు



వచ్చింది. ఆ కుటుంబ సభ్యులందరూ అమ్మ చేతి వంట తినాలన్న తమ కోరిక అమ్మకు విన్నవించుకొనడంతో అమ్మ అందుకు అంగీకరించారు. ఒకరోజు వారందరికీ అమ్మ స్వయంగా వంట చేశారు. వారంతా తోటలోని చెట్ల మధ్య కూర్చొని ఆనందంగా భోజనాలు చేశారు. అద్భుతమైన అమ్మ చేతి వంటను వాళ్లు ఎంతగానో మెచ్చుకొనటం జరిగింది. షాహ్-బాగ్ లోని తోటలోని కాళీమాత విగ్రహం

మెడలో ప్యారిబాను ఒక బంగారు గొలుసు అలంకరించింది

శ్రీ ఆనందమయి మాత తన జీవితమంతా ఎక్కువ భాగం పర్యటనలలోనే గడిపారు దేశంలోని అన్ని పుణ్యస్థలాలు, పుణ్యతీర్థాలు సందర్శించారు. ఒకసారి అమ్మ భక్తులందరితో కలసి 1927లో 'గౌహతి'లోని కామాఖ్య దేవాలయానికి వెళ్లారు. అందరూ కామాఖ్య పర్వతం ఎక్కి కామాఖ్య దేవి దర్శనం చేసుకున్నారు. ఒకనాటి రాత్రి జరిగిన కొన్ని విషయాలను కొన్ని రోజుల తర్వాత అమ్మ ఇలా చెప్పారు: "నేను ఒకనాటి రాత్రి కామాఖ్య పర్వతంపై తిరుగుతున్నాను. ఉన్నట్లుండి కొండ ప్రదేశం అంతా ఒకానొక దివ్యశక్తితో నిండిపోయింది. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఇంకా దేవీ దేవతలు ఎందరో కిరీటధారులై తిరుగుచున్నారు. చిన్నపిల్లల వలె వారంతా ఆటలాడుకుంటూ ఎంతో సంతోషంగా సంచరిస్తున్నారు. ఇంకా చాలామంది ఋషులు, మునులు, జటాధారులు వున్నారు. నన్ను చూచి వారందరూ ఎంతో సంతోషించారు. ఆ స్థల ప్రభావం ఎంతో గొప్పది. ఆనాడు కొండమీద నాకు కనిపించిన దృశ్యాలు ఎంతో అద్భుతమైనవి. ఆనాడు నా వెంట కొందరు భక్తులున్నారు. నిర్మలబాబు భార్య నా పక్కనే వున్నది. ఆమెకు గాని, మరెవరికి గాని ఆ దృశ్యాలు కనిపించలేదు."

షాహ్-బాగ్ లో వుండగా మరొక సంఘటన జరిగింది. ఆ సన్నివేశం చూసిన ముసల్మానుల హృదయాలలో ఆ సంఘటన ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నది. ఒకనాటి సాయంత్రం అమ్మ గృహంలో భక్తులందరూ సంకీర్తన చేస్తున్నారు. ఆరోజు సంకీర్తనకు ఒక ముసల్మాను భక్తుడు కూడా వచ్చాడు. సంకీర్తన మధ్యలో అమ్మ వున్నట్లుండి లేచి నిలబడి వేగంగా నడుస్తూ తోట వెలుపల సమీపంలోని ఫకీర్ సాహెబ్ సమాధి వద్దకు ఆ చీకట్లోనే నేరుగా వెళ్లి సమాధి పైకి ఎక్కి నిలబడ్డారు. భక్తులంతా అమ్మను వెంబడించి ఆ సమాధి వద్దకు చేరుకున్నారు. అమ్మ ఆ ముస్లిం భక్తుని వీపుపై తన చేతితో గట్టిగా చరచారు. వెంటనే అతడు సమాధి తలుపులు తెరిచాడు. అమ్మ సమాధి ప్రాంగణం లోనికి ప్రవేశించి, నలువైపులా తిరిగి ఒకచోట నిలుచుని ఖురాన్ లోని ఆయతులను గట్టిగా చదవసాగారు. అమ్మ అలా స్పష్టంగా ఖురాన్ లోని ఆయతులను చదువుతుంటే అక్కడ గుమిగూడిన ముస్లిం భక్తులు నమాజ్ విధానం ప్రకారం తలలు వంచుకొని ప్రార్థనలో పాల్గొన్నారు. అలా ముస్లింలవలె ముస్లిం నియమానుసారం కూర్చుంటూ, లేస్తూ, చేతులు పైకెత్తుతూ – ఇలా నమాజ్ చదువుతూ ప్రార్థనలో లీనమైపోయారు. ఆ తర్వాత అమ్మ సమాధి దిగివచ్చి ఇంటికి చేరుకున్నారు. సంకీర్తన అనంతరం భక్తులందరికీ ప్రసాదం పంచబడింది. అయితే ఆ ముస్లిం భక్తుడు మాత్రం అమ్మకు ఆ రోజు తన స్వహస్తాలతో ప్రసాదం తినిపించాలన్న కోరికను అమ్మకు విన్నవించగా అమ్మ సంతోషంగా అంగీకరించారు.

ఈ విషయం గురించి అమ్మ కొన్నాళ్ల తర్వాత ఇలా చెప్పారు: "ఆ రోజు ఖురాన్ లోని ఆయతులు నా నోటి నుండి వెలువడటం అనేది నా ప్రయత్నంతో జరిగింది కాదు. నా ప్రమేయం ఏమీ లేకుండానే యిలాంటివెన్నో జరుగుతుంటాయి. భాష, స్వరము అన్నీ అప్రయత్నంగానే నా నోటి నుండి వెలువడ్డాయి."

ఖురాన్ ఆయతులు చదివేటప్పుడు ముస్లింలు రకరకాల భంగిమలు శరీరంతో చేస్తూవుంటారు. అలా ఎందుకు చేస్తారని ప్రశ్నించిన భక్తులతో అమ్మ ఇలా అన్నారు: "హైందవ సాంప్రదాయంలో కూడా దైవపూజలు చేసే సమయంలో వివిధ భంగిమలు చేస్తూ ప్రార్థించడం వున్నది కదా! నమస్కార భంగిమలు, అంగన్యాస-కరన్యాసములు యిలా అనేక రకాలైన శరీరక్రియలు, మంత్రోచ్చారణతో స్వరగతులు – ఇలా మనసుతో శరీరాన్ని అనుసంధానం జరుపటం వలన ఆధ్యాత్మిక సాధన పురోగతి సులభంగా జరుగుతుంది. ఈ విధానాలన్నీ సాధకునికి మోక్షమార్గంలో ముందుకు సాగటానికి ఎంతగానో తోడ్పడతాయి. ఖురాన్ లోని ఆయతులు చదివే విధానం కూడా ఇటువంటిదే. ఆ రకమైన శారీరక క్రియలు వెనుక ఎన్నో నిగూఢమైన అర్థాలు వుంటాయి. వాటిని తెలుసుకొని ఆయతులు చదవటం, నమాజు చేయటం వంటివి అన్నీ ఆచరించవలసి వుంటుంది. అర్థాలు తెలుసుకొనకుండా ఎటువంటి ప్రార్థనలు చేసినా వ్యర్థమే."

ఆశ్చర్యకరమైన విషయం

ఏమిటంటే - ఆనాటి దేశకాల పరిస్థితులలో ఒక ముసల్మాను నవాబుల తోటలో ఒక హైందవ యోగిని మహాత్మురాలు నివసించటం ఆమె శిష్యులు, భక్తులు హైందవ విధానాలతో పూజలు, భజనలు, సంకీర్తనలు, ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుపుకొనడం అనేది సామాన్యమైన విషయం కాదు. అమ్మ మహిమ, అమ్మ దివ్యత్వం, విశ్వమానవ ప్రేమ అనేవి ప్రజలలో కులమత భేదాలను మరిపింపజేసి సమాజంలో సర్వ మత సౌభ్రాతృత్వాన్ని పెంపొందింపజేశాయి.

శ్రీ ఆనందమయి మాత ఫకీర్ సాహెబ్ సమాధి వద్ద ఖురాన్ లోని ప్రార్థనలు చేశారన్న విషయం ప్యారీబాను కుటుంబ సభ్యులందరికీ తెలిసింది. వారంతా ఢాకా కు వచ్చి అమ్మను దర్శించుకున్నారు. ఫకీర్ సాహెబ్ సమాధి వద్ద ఖురాన్ ప్రార్థనలు చేయవలసినదిగా అమ్మను వేడుకున్నారు. వారందరితో కలిసి అమ్మ ఫకీర్ సాహెబ్ సమాధి వద్దకు వెళ్లారు. అమ్మ అక్కడ చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. ఆ తర్వాత అమ్మ లేచి నిశ్చలంగా నిలబడ్డారు. వెంటనే అమ్మ నోటి నుండి ఖురాన్ సూక్తులు కొన్ని వెలువడనారంభించాయి. నవాబు ఘరానాలోని వారంతా ఆ సూక్తులు ఖురాన్ లోని కొన్ని భాగాలుగా, ప్రార్థనలుగా గుర్తించారు. ఆ విధంగా శ్రీ ఆనందమయి మాత ప్యారీబాను కుటుంబాన్ని సంతృప్తి పరచి ఆశీర్వదించారు.

భక్తజనుల పట్ల అమ్మ చూపించే ప్రేమ అపారం. ఫిరోజ్ పూర్ లో నివసించే దినేష్ బాబు తమ ఊరికి విచ్చేయవలసిందిగా అమ్మను ప్రార్థించాడు. అతని ప్రార్థనను మన్నించి అమ్మ ఫిరోజ్ పూర్ వెళ్లారు. ఆ ఊరు చేరుకోగానే అమ్మకు ఆహ్వానం పలికేందుకు వేచివున్న భక్తజనులు అమ్మను చందన పుష్పమాలలతో అలంకరించి, పూజించి దైవ నామ సంకీర్తనలతో ఊరిలోకి తీసుకొని వెళ్లారు. రెండు రోజులపాటు అహర్నిశలు దైవ నామ సంకీర్తనతో ఆ ఊరంతా మారుమ్రోగింది. ఊరిలోని వారంతా తృప్తిగా అమ్మను పూజించుకున్నారు. అయితే ఆ ఊరిలోని ఒక వృద్ధురాలు అమ్మను దర్శించుకోవాలని ఎంతగానో తపించింది. నడవలేని స్థితిలో వున్న ఆ వృద్ధురాలు తన అసహాయతకు అమ్మను దర్శించుకోలేని తన దురదృష్టానికి ఎంతగానో దుఃఖిస్తూ ఇంట్లోనే వుండిపోయింది. అయితే సర్వజ్ఞురాలైన అమ్మకు తెలియనిది ఏమున్నది? భక్తుల నడుమ కూర్చుని వున్న అమ్మ వున్నట్లుండి లేచి నిలబడి వడివడిగా నడుస్తూ ఒక మారుమూల వీధిలోని వృద్ధురాలి ఇంటిలోకి వెళ్లారు. ఆమెను ఆప్యాయంగా పలకరించి ఆమె ప్రక్కనే కూర్చొని ఆమెకు ప్రసాదం తినిపించారు. అలా ఆమెను తృప్తిపరచి తన దర్శనం ప్రసాదించి ఆమెను అనుగ్రహించారు శ్రీ ఆనందమయి అమ్మ.

అమ్మ లోగడ కొంతకాలం క్రిందట దేవఘర్ అనే ఊరిలోని శ్రీ బాలాజీ స్వామి అనే ఒక సన్యాసి ఆశ్రమానికి వెళ్లి ఆయనను ఆశీర్వదించి వచ్చారని తెలుసుకున్నాం. ఆ సందర్భంలో బాలాజీ స్వామి అమ్మకు భక్తుడైన శశాంకబాబుతో “నువ్వు ఆశ్రయించిన ఆనందమయి మాత ఒక సాధకురాలు కానేకాదు. ఆమె సాక్షాత్తు దేవి స్వరూపిణి. లోకోద్ధరణ కోసం అవతరించిన పరాశక్తియే శ్రీ ఆనందమయి మాత. ఆ తల్లిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క క్షణం కూడా విడిచిపెట్టవద్దు” అన్నారు. అయితే శ్రీ ఆనందమయి మాత ఒక సాధారణ వ్యక్తి వలె వ్యవహరించటం వలన భక్తులు కూడా ఆమెతో చనువుగా వ్యవహరించటం జరుగుతుండేది.

ప్రమథబాబు అనే ఒక భక్తుడు కొంతకాలంగా అమ్మ వద్దకు వస్తుండేవాడు. అయితే ఎందుకో గాని అతనికి ఒకానొక సందర్భంలో ‘అమ్మ నిజంగా ఒక మహాత్మురాలు అవునా? లేక సామాన్య స్త్రీ నా?’ అన్న సంశయం తలెత్తింది. అతను ఇలా అనుకున్నాడు: ‘అమ్మను సకల దేవతాస్వరూపిణిగా భక్తులు భావిస్తున్నారు కదా. ఆ మాటే నిజమైతే అమ్మ నా యిష్టదేవతా రూపంలో దర్శనం యివ్వాలి. అలా అయితేనే అమ్మను నేను మహాత్మురాలుగా నమ్ముతాను’ అని! అలా అనుకున్న కొన్నాళ్ల తర్వాత అమ్మ, భోలానాథ్ గారు సిద్ధేశ్వరికి వెళ్లారు. ఆ రోజు ప్రమథబాబు కూడా వారితో వున్నాడు. ఆనాటి రాత్రి శ్రీ భోలానాథ్ గారు, అమ్మ, ప్రమథబాబు మాట్లాడుకుంటూ వుండగా అర్ధరాత్రి అయింది. శ్రీ భోలానాథ్ గారు నిద్రకు ఉపక్రమించారు. అదే సమయంలో అమ్మ ఒక అలౌకిక స్థితిలో లేచి నిలబడి చిరునవ్వుతో ప్రమథ బాబు వైపు

చూశారు. ప్రమథ బాబు తన కనులు తానే నమ్మలేక పోయాడు. సాక్షాత్తు దేవి స్వరూపిణి రాజరాజేశ్వరి మాతగా అమ్మ ప్రమథబాబుకు దర్శనమిచ్చారు. తన ఆరాధ్య దేవతగా, తను ఆశించిన విధంగానే శ్రీ ఆనందమయి మాత దర్శనం యివ్వటంతో ఆనందంతో అమ్మకు సాష్టాంగ ప్రణామాలాచరించాడు ప్రమథ బాబు. ఆ రోజుతో అమ్మ గురించిన సకల సంశయాలు పటాపంచలయినాయి. ప్రమథబాబు అమ్మకు గొప్ప భక్తుడుగా మారిపోయాడు.

కొంతసేపటికి అమ్మ మామూలు స్థితికి వచ్చారు. విశేషమేమంటే మరొక సందర్భంలో ప్రమథ బాబు నౌకరుకు కూడా అమ్మ అద్భుతమైన దివ్యానుభూతిని ప్రసాదించారు. అతను ఆనందంతో "అయ్యగారూ, పది దివ్య రూపాలలో ఆనందమయి అమ్మవారు నాకు శక్తి స్వరూపిణిగా దర్శనమిచ్చారు" అన్నాడు ప్రమథబాబుతో. ప్రమథబాబు పట్టరాని ఆనందంతో అతనిని కౌగిలించుకొని, "నేను కేవలం ఒక్క రూపాన్ని మాత్రమే దర్శించాను. కానీ నువ్వు దశవిధ దేవి సాక్షాత్కారాన్ని పొందావు. నీ భాగ్యం ఏమని చెప్పను?" అంటూ అతని అదృష్టాన్ని కొనియాడాడు.

సిద్ధేశ్వరిలో తాత్కాలికంగా నిర్మింపబడిన గది మట్టిగోడలతో కట్టడం వలన శిథిలావస్థకు చేరుకుంది. అందువలన భక్తులంతా ఆ గది తొలగించి దృఢమైన సిమెంట్ గోడలతో ఒక మంచి గది నిర్మించాలని సంకల్పించారు. శశాంకబాబు అనే భక్తుడు ఈ నిర్మాణబాధ్యతను స్వీకరించాడు. అతడు అక్కడి స్థలంతోపాటు ఆ ప్రదేశానికి నలువైపులా వున్న మరికొంత స్థలాన్ని కూడా కొని అమ్మ సూచనల మేరకు ఒక విశాలమైన పెద్ద గదిని నిర్మాణం చేశాడు. ఆ సందర్భంగా అమ్మ ఆ ప్రదేశపు విశిష్టతను తెలిపారు. "ఈ ప్రదేశం ఒక మహిమాన్విత చరిత్ర కలిగివుంది. ఎందరో మహనీయులతో పునీతమైనది. ఈ పవిత్ర భూమితో శ్రీ ఆదిశంకరాచార్యుల వారికి గల సంబంధం విశిష్టమైనది. అయినప్పటికీ యిన్నాళ్లుగా యీ ప్రదేశం యీ నిర్జన ప్రాంతంలో తన మహిమను గోప్యంగా దాచుకొని వుండిపోయింది. కాలగమనంలో యే సమయాన యీ ప్రాంతపు దివ్యత్వం ప్రకటం అవ్వాలో ముందుగానే నిర్ణయం అయివున్నది. దాని ననుసరించి యీనాటికి ఆ సమయం వచ్చింది. సాధకులు యీ ప్రదేశంలో దీక్షలు, కఠోర సాధనలు చేసుకునేందుకు వీలుగా ఇక్కడ ఈ విధమైన నిర్మాణాలు జరగటం ఎంతో అవసరం" అన్నారు అమ్మ.

ఒకసారి 'వాక్కు నియంత్రణ' అనే విషయం గురించి శ్రీ ఆనందమయి అమ్మ యిలా చెప్పారు: "ప్రతి ఒక్క విషయంలోనూ సంయమనం, జాగ్రత్త పాటించటం అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొనవలసిన విషయం. నియమానుసారం ప్రవర్తించవలసిన అవసరం ఒక్క ఆధ్యాత్మిక సాధకులకు మాత్రమే విధింపబడలేదు. పండితులయినా, పామరులయినా 'మాట్లాడడం' లో అప్రమత్తులై వుండడం మంచిది. ఎందుకంటే కాల ప్రభావం గొప్పది. ఒక్కొక్క సమయంలో నోటినుండి వెలువడిన మాటలు వాస్తవంగా జరుగుతూ వుంటాయి".

శ్రీ ఆనందమయి అమ్మ చెప్పిన యీ విషయం ఎంత ముఖ్యమైనదో నిరూపించే ఒక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది.

ఒకసారి అమ్మ పర్యటనార్థం బయలుదేరారు. గిరిడీహ్, చునార్, మీర్జాపూర్, వింధ్యాచలం, తారకేశ్వర్, నవద్వీప్, జైపూర్, భరత్పూర్ - యిలా అనేక క్షేత్రాలు దర్శించారు అమ్మ. ఆ పర్యటనకు బయలుదేరే ముందు భక్తులు అమ్మకు వీడ్కోలు పలికేందుకు షాహ్-బాగ్ తోటలోని గృహానికి వచ్చారు. అమ్మ కొందరు భక్తులతో ఇంటి నుండి బయలుదేరారు. అమ్మ మరల ఎన్నాళ్లకు తిరిగి వస్తారోనన్న బాధతో కొందరు భక్తులు అమ్మను త్వరగా తిరిగిరమ్మని వేడుకుంటున్నారు. ఆ సందర్భంలో ప్రఫుల్ల బాబు అనే భక్తుని భార్య అమ్మతో కొంచెం పరిహాసంగా "అమ్మా, నువ్వు లేకుండా మేము ఇక్కడ ఎలా బ్రతకగలమనుకుంటున్నావు? నువ్వు చాలా త్వరగా తిరిగి రావాలి సుమా. అలా రాకుంటే నేనేం చేస్తానో నాకే తెలియదు. అసలు షాహ్-బాగ్ లో నిన్ను అడుగుపెట్టనివ్వను. తోటలోకి రానివ్వకుండా గేటు మూసేస్తాను" అన్నది. ఆ భక్తురాలు అమాయకంగా కేవలం అమ్మ త్వరగా తిరిగిరావాలని కోరికతోనే అన్నప్పటికీ ఆ మాటే నిజమైంది.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)


# ఆశాజ్యోతి

*శ్రీ వాసుదేవరావు*

***(మాస్టరుగారి పరిచయ భాగ్యాన్ని పొందిన పిమ్మట అప్పటి వరకు తాను చేసిన బాబా పూజా విధానం ఎంత యాంత్రికమో అర్థమయి, వారి ప్రబోధాన్ని అందుకుని సాయినాథుని అనన్య భక్తితో కొలిచేందుకు మార్గదర్శకులైన మాస్టరుగారిని, బాబా గారిని రెండు చక్షువులుగా భావించి సాయి మాస్టర్ సన్నిధిలో తను పొందిన అనుభూతులను అందించుచున్నారు.)***

ఒకసారి జిల్లేళ్ళమూడి అమ్మ వద్దకు వెళ్ళి మా అమ్మాయి పెండ్లి పత్రిక ఇవ్వగా దాని పైనున్న బాబా ఫోటో చూడగానే, "నాయనా! భరద్వాజ బాగున్నాడురా! వాడికి నా ఆశీస్సులు చెప్పరా!" అని, "ఇదిగో, ఈ ప్రసాదం తీసుకొని వెళ్ళి భరద్వాజకు ఇవ్వరా!" అని చేతికిస్తుండగా, నాకు ఆనందబాష్పాలు రాలాయి. ఇంకొకసారి నేను, మాస్టరుగారు కలిసి రామ్ చరణ్ గారి వద్దకు (కుందుర్తి వెంకట నరసయ్య - రామ భక్తుడు) వెళ్ళగా "సాయినాథుడు వస్తున్నాడు" అని అన్నారు. సాయి మందిరానికి భగవాన్ రమణ మహర్షి భక్తురాలైన సౌరిస్ గారు వచ్చారు. తర్వాత మందిరం నుండి మాస్టరుగారింటికి వెళ్ళి చాలాసేపు కూర్చుని, "ఇక్కడ నాకు ఎంతో ఆనందంగా వుంది" అన్నారు.

ఆ రోజు ఏప్రియల్ 12వ తేదీ! అశనిపాతం లాంటి వార్త! మాస్టార్ గారు మనకిక లేరు. మహాసమాధి చెందినారని విని నిశ్చేష్టుల మయ్యాము. జనం తండోప తండాలుగా వస్తున్నారు. ఈ శాశ్వత ఎడబాటును దుఃఖిస్తూ ఆయన చెంత చేరిన వారెందరో! అలాంటి సమయంలో కూడా మాస్టార్ గారిచ్చిన స్ఫూర్తి, ప్రేరణ లేక వారిచ్చిన తత్త్వబోధ ఏమోగాని మాలో ఒక మొండి ధైర్యాన్ని కల్గించి వారు భౌతిక దేహాన్ని చాలించినట్లు దేశములో నలుమూలలా వున్న వారి శిష్యులకు, బంధువులకు, స్నేహితులకు తెలియపరచటం కోసం ఆల్ ఇండియా రేడియో, విజయవాడ, హైద్రాబాద్,



దూరదర్శన్ వారితో ప్రెస్ విలేఖరులతో సంప్రదించుటకు తదితర ఏర్పాట్లు కొరకు మమ్మల్ని ఆయత్తపరిచినట్లు అనిపిస్తుంది మాస్టార్ గారు. 12వ తేదీనాడు భౌతిక దేహాన్ని చాలించారు. 13వ తేదీనాడు వారి భౌతిక కాయాన్ని బాబా మందిర ప్రాంగణంలో సమాధి చేశాము. ఆ మర్నాడు

***మిగతా 29వ పేజీలో***

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి కేసవరపు రేణుక, ఒంగోలు

చాల సంవత్సరముల క్రితము నాకు బాబా స్వప్న దర్శనమిచ్చారు. అది మధ్యాహ్న సమయం! నేను బాగా నిద్ర పోతున్నాను. బాబా వచ్చారు కదా లేవాలని ఎంత ప్రయత్నించినా లేవలేక పోతున్నాను. అప్పుడు బాబా నాతో, "బాబా, బాబా అని పిలుస్తావు, వస్తే మాత్రం నిద్రపోతూ ఉంటావు" అని మాయం అయిపోయారు. నేను ఇదివరకు ఎక్కువగా నిద్ర పోయేదాన్ని. బాబా దయవల్ల నిద్ర చాలా వరకు తగ్గింది.

ఒకసారి రాత్రి స్వప్నంలో------ ఒక అడవిలో నేను నడుస్తున్నాను. బాబా ఒకచోట కూర్చుని వున్నారు. ఆయన ముందునించి నేను వెళ్లి పోతుంటే నన్ను పిలిచి, గురుచరిత్ర గ్రంథం నాకు ఇస్తున్నారు. నేనేమో "ఆ గ్రంథం నిష్ఠగా చదవాలి కదా, నేను చదవలేను" అన్నాను. నా మాటలేమీ పట్టించుకోకుండా బాబా ఒక కాషాయ వస్త్రంలో ఆ గ్రంథాన్ని చుట్టి నా చేతిలో పెట్టారు. ఇక అప్పటినించి గురుచరిత్ర పారాయణ చేస్తున్నాను. అంతకు ముందు నెల్లూరులో ఒక సత్సంగ సభ్యులు గురుచరిత్ర గ్రంథం నాకు ఇచ్చారు. కానీ చదివేదాన్ని కాదు. ఈ స్వప్నం 2019లో వచ్చింది. అంతకు నాలుగు సంవత్సరాల ముందునుంచి పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పరిచయం అయ్యాయి. అన్ని గ్రంథాలు పారాయణ చేస్తున్నాను. కానీ గురుచరిత్ర మాత్రం పారాయణ చెయ్యాలంటే ఏదో ఇబ్బందిగా ఉండేది. ఈ స్వప్న దర్శనం అయ్యాక సప్తాహపారాయణలు చేస్తున్నాను.

ఇంకొక స్వప్నంలో, నేను ఎక్కడికో నడుచుకుంటూ వెడుతున్నాను, ఒకచోట ధుని పక్కన బాబా కూర్చుని కనిపించారు. నేనక్కడకి వెళ్లాను. వెళ్ళగానే నావైపు చేయి చాచి "ఒక్కపూటే అన్నం తింటానని ఒట్టెయ్యి" అన్నారు. ఆయన అడిగిన వాగ్దానానికి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే నాకు ఉపాహారాల కన్నా అన్నం అంటే చాలా ఇష్టం. వీలయితే మూడుపూటలా అన్నమే తింటాను. అలాంటిది బాబా ఒక్కపూట మాత్రమే తినమంటే నావల్ల కాదనిపించింది. నేనేం సమాధానం చెప్పలేదు, మెలకువ వచ్చేసింది. బాబాకి స్వప్నంలో మాట ఇవ్వకపోయినా, అప్పటినించి ఒక్కపూట మాత్రమే అన్నం తింటున్నాను, ఇంకొక పూట ఉపాహారం మాత్రమే తీసుకుంటున్నాను. ఇది జరిగి నాలుగు సంవత్సరాలయ్యింది.

కొన్ని రోజుల క్రితం నాకు దత్త నామం ఎక్కువ స్ఫురణకు వస్తుండేది. మామూలుగా సాయిమాస్టర్ అనుకోవడం అలవాటు. కానీ ఈమధ్య ఈ నామం వస్తోంది. 'నాకు బాబా చెప్తేకదా నేను దత్త నామం అనుకోవాలి' అనిపించేది. ఒకసారి స్వప్నంలో నేను దత్త నామం చెప్పుకుంటుంటే బాబా దర్శనం ఇచ్చారు. నేను వారి పాదాలకి నమస్కారం చేసుకుంటూ 'బాబా' నామం స్మరిస్తున్నాను. బాబా నన్ను దీవిస్తూ అక్షింతలు వేశారు. అప్పుడు ఏ నామమైన వారిదే, దత్తుడే బాబా అనిపించింది.

నాకు అనుభవాలని బాబా చాల చిత్రంగా ప్రసాదిస్తారు. అవి ఎక్కువగా నా బలహీనతల్ని సరిదిద్దేవిగా ఉంటాయి. ఆయన స్వప్న దర్శనమిచ్చి ఏదైనా బోధ చేస్తే కొన్నాళ్ళకి నా సమస్య లేదా బలహీనత సమసిపోతుంది. మేము ఈమధ్యనే నెల్లూరు నించి

**మిగతా 29వ పేజీలో**

# ఆచార్యుని అద్భుత లీలలు

*శ్రీ విజయభాస్కర్, కోట*

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి లీలావైభవాన్ని వారి పూర్వ విద్యార్థి, కోట సత్సంగ సభ్యులు అయిన విజయభాస్కర్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు--

నేను మొట్టమొదటిసారి ఫిబ్రవరి 8, 1973లో గురువారంనాడు విద్యానగర్ లో పూజ్యశ్రీ మాస్టరుగారి తపోవనంలో భజన జరుగుతూవుంటే వెళ్లాను. అప్పుడే వారి ప్రథమ దర్శనం జరిగింది. వారు బాబా గురించి చెబుతూంటే చాలా ఆసక్తిగా వుండేది. అంతేకాదు, అందరితో చాలా ప్రేమగా వుండేవారు, ప్రేమగా మాట్లాడేవారు. అప్పుడే నా పదవ తరగతి పూర్తయింది. పరిచయం పెరిగి పెరిగి పూజ్యశ్రీ మాస్టరుగారితోనే ఎక్కువ గడపాలనిపించేది. మాకు విద్యానగరులో ఇప్పుడు బాబా మందిరం వున్న చోట పొలాలు వుండేవి. మా నాన్నావాళ్ళందరూ కోటలో వుంటే నేను ఆ పొలంలో గుడిసె వేసుకుని వంటచేసుకుంటూ ఒక్కడినే వుండేవాడిని. అలా అయితే పూజ్యశ్రీ మాస్టరుగారికి దగ్గరగా వుండొచ్చని నా ఉద్దేశం. నాకు సైన్స్ గ్రూప్ అంటే చాలా ఇష్టం. కానీ అడ్వాన్స్డ్ ఇంగ్లీష్ గ్రూప్ అయితే లాంగ్వేజెస్ లో ఇంగ్లీష్ తో పాటు ఇంకొక క్లాస్ లో పూజ్యశ్రీ మాస్టరుగారితో గడిపే అవకాశం వుంటుందని అందులో చేరాను. అందులోనూ అడ్వాన్స్డ్ ఇంగ్లీష్ క్లాస్ లో చాలా తక్కువమందిమి వుండేవాళ్ళం. వారు సబ్జెక్టు చెపుతూంటే అందులో లీనమై చెప్పేవారు. మేమందరమూ వారితోపాటు లీనమైపోయేవాళ్ళం. అటువంటి బోధ ఎవ్వరికీ, ఎప్పటికీ దొరకదని నా ఉద్దేశం. మేము నిజంగా అదృష్టవంతులం.

పూజ్యశ్రీ మాస్టరుగారు మాచేత కొన్ని సాధనలు చేయించేవారు. అవి సాధనలని అప్పుడు తెలియదు. చెప్తే చేయడమే గాని, వివరమేమిటనే ఆలోచన వుండేదే కాదు. కొత్తపాలెం వెళ్లే రోడ్డులో ఒక మర్రిచెట్టు వుండేది. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను ఒక్కడినే అర్ధరాత్రి బట్టలేమీ వేసుకోకుండా ఒక దుప్పటి మాత్రమే కప్పుకుని వెళ్ళమని చెప్పారు. నేను అలాగే చేసాను. ఆ చెట్టుమీద అదృశ్యంగా ఒక సాధువు వున్నాడని, అక్కడ ధ్యానం చేస్తే మంచిదనీ మమ్మల్ని అక్కడకి పంపించేవారు. నిజంగానే అక్కడ ధ్యానం చేస్తే మానసికంగా ఉత్తేజంగా వుండేది. అలాగే ఒకసారి నన్ను, టి.డి.కృష్ణమూర్తిని ఒక శని, ఆదివారాలు ఒక చిట్టడవిలో గడిపిరమ్మన్నారు. మాతోపాటు తినడానికి బ్రెడ్ తీసుకుని వెళ్లాము. అక్కడ దగ్గరలో చిన్నగుంటలో నీళ్లుంటే అందులో చెట్లగింజలు కొన్ని వేస్తే అవి తేటగా వచ్చాయి. ఆ నీళ్లు తాగేవాళ్ళం. శనివారం ఉదయం అంతా బాగానే గడిచింది. ఆ రాత్రి వెలుతురు కోసం మంట వేసుకున్నాము. అర్ధరాత్రిపూట ఎవరో వస్తున్నట్టు నాకు ఎదురుగా కనపడుతోంది. నేను, కృష్ణమూర్తి ఎదురుబదురుగా కూర్చున్నాం. తనకు వాళ్ళు కనపడరు, నాకు కనిపిస్తున్నారు. నేను తనను, “మూర్తీ!” అని పిలుద్దామనుకుంటున్నాను. కానీ భయంతో మాట రావడం లేదు. తను నావైపు చూడటం లేదు. మంటలో పుల్లలు వేస్తున్నాడు. వాళ్ళు దగ్గరకి వచ్చారు. అంతకుముందు ఆ అడవిలో ఏదో గొడవ జరిగిందట. కనుక అటవీశాఖవారు ఎవ్వరినీ లోపలకు రానివ్వడం లేదు. వాళ్లొచ్చి ఏం గొడవ చేస్తారోనని నా భయం. వాళ్ళు దగ్గరకి రాగానే కృష్ణమూర్తి వెనక్కి తిరిగి చూశాడు. అందులో మూర్తికి తెలిసిన

ఫ్రెండ్ వుండడంవల్ల మమ్మల్ని వాళ్ళేమీ అనలేదు. మర్నాడు సాయంత్రానికి తిరిగి వచ్చాం. ఆ రెండురోజులూ ఆసనాలు, ధ్యానం, పారాయణ, సత్సంగం చేసుకోమన్నారు పూజ్యశ్రీ మాస్టరుగారు. అలా ఏవేవో మా చేత చేయించేవారు.

నేను పూజ్యశ్రీ మాస్టరుగారు కాల్చి వదిలేసిన సిగెరెట్ ప్యాకెట్ మీద -- అంటే తెల్లగా వున్న లోపలి భాగంలో, 'ఓం శ్రీ సాయిభరద్వాజాయ నమః' అని వ్రాసుకునేవాడిని. సిగరెట్ ప్యాకెట్ మీదే ఎందుకంటే 'వారు వాడినది కదా!' అని. ఒకసారి ఇది వారి కంటపడింది. "ఏం వ్రాస్తున్నావురా?" అని అడిగారు. చూపించాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "నువ్వు వేరు, నేను వేరు, బాబా వేరు, ఇన్ని లేవురా! ఉన్నది ఒక్కటే, కనక బాబా ఒక్కటే వ్రాసుకో!" అన్నారు. నాకు ఉపదేశం కూడా అయిపోయిందనుకున్నాను. అప్పటినుంచి నేను, 'ఓం శ్రీ సాయినాథాయ నమః' అన్న నామం చేసుకుంటాను.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఆంగ్లంలో వ్రాసిన 'సాయిబాబా ది మాస్టర్' గ్రంథాన్ని నేనే టైపు చేసేవాడిని. అలా టైపు చేసి పెడితే ఆయన నన్ను శిరిడి తీసుకువెళతానన్నారు. ఆ సందర్భంలో వెళ్ళినప్పుడే నాకు రెండు పది రూపాయల నోట్లు ద్వారకామాయిలో దొరికాయి. అవి పూజ్యశ్రీ మాస్టరుగారికి ఇచ్చాను.

పూజ్యశ్రీ మాస్టరుగారి దాతృత్వానికి ఒక ఉదాహరణ. మాకు విద్యానగర్లో పొలాలుండేవి కదా! అప్పుడు మా నాన్నతో సంబంధం లేకుండా నేనొక్కడినే వ్యవసాయం చేసేవాడిని. ఒక సంవత్సరం పంట నష్టమొచ్చింది. 6000 రూపాయలు బ్యాంకుకి అత్యవసరంగా కట్టవలసివచ్చింది. లేకపోతే పోలీసులు పట్టుకుపోతారని భయపెట్టారు. నేను వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్లి ఈ విషయం చెప్పాను. వెంటనే తమ అకౌంట్ నుంచి డబ్బులు తెచ్చుకుని బ్యాంకుకి కట్టమన్నారు. ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు! నేను అలాగే చేశాను. ఆ కరుణామూర్తి దాతృత్వానికి నా నోట మాట రాలేదు.

1978వ సంవత్సరంలో నా ఇష్టప్రకారం మా చిన్న తాతయ్యగారి మనవరాలిని వివాహం చేసుకున్నాను. ముందు తపోవనంలో పూజ్యశ్రీ మాస్టరుగారి సమక్షంలో వివాహం చేసుకోవాలని నా ఉద్దేశం. అందువల్ల రేపు పెళ్లి అనగా ముందురోజు పూజ్యశ్రీ మాస్టరుగారి సమక్షంలో గురువారంనాడు గోధూళివేళ మాలలు మార్చుకున్నాం. అప్పుడు కొంతమంది సత్సంగ సభ్యులు, కుటుంబసభ్యులూ వున్నారు. అప్పుడే ఒక సత్సంగసభ్యుడు శిరిడీనుంచి ప్రసాదం తెచ్చిచ్చాడు. మర్నాడు మామూలుగా పెళ్లి జరిగింది. ఈ సందర్భంగా పూజ్యశ్రీ మాస్టరుగారు మాకొక దీక్ష ఇచ్చారు. 16 రోజుల పండగవరకూ ఇద్దరినీ సాయంత్రం షోడశోపచారపూజ చేసుకోమన్నారు. మేము అలాగే చేసుకున్నాము. అప్పుడు నేను డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాను. తరవాత బి.ఎడ్. కూడా పూర్తి చేశాను.

తరవాత ఒంగోలులో ముద్రణాలయం (ప్రింటింగ్ ప్రెస్) పెట్టాము. సంతపేటలో ఒక ఇల్లు తీసుకున్నాము. ఒకవైపు భాగంలో ముద్రణాలయం, మరొక భాగంలో పూజ్యశ్రీ మాస్టరుగారి కుటుంబం, వెనుకవైపు గదిలో మా భార్యభర్తలం వుండేవాళ్ళం. కొన్నాళ్ల తరవాత మా నాన్న మా ఊరికి రమ్మంటే వెళ్ళిపోయాము. ఇక అప్పటినుంచి అప్పుడప్పుడు రావడమే జరిగేది. అలా చాలాకాలం గడిచింది.

1989లో పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందారని తెలిసి చాలా బాధపడ్డాను. 'అయ్యో, ఇంత మంచి ఆధ్యాత్మికమార్గం సూచించే వాళ్ళు మళ్ళీ దొరుకుతారా?' అనిపించింది. అలా బాధపడుతున్న రోజుల్లో ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చారు. స్వప్నంలో నా ఎదురుగా కూర్చున్నారు. "సార్, మీరు సమాధి చెందారని చాలా బాధగా వుంది. ఆ బాధ పోవాలంటే ఏం చెయ్యాలి?" అనడిగాను. దానికి పూజ్యశ్రీ మాస్టరుగారు, "180 సార్లు బాబా చరిత్ర చదువు!" అన్నారు. నేను, "108 సార్లు చేయమంటారా?" అనడిగాను. 'కాదు, 180 సార్లు!" అన్నారు. 180 సార్లు చేద్దామని మొదలుపెట్టి పారాయణ చేస్తున్నాను.

మాకు కోటలో బాబా మందిరం వుంది. ప్రస్తుతం ఆయన సేవ చేసుకుంటూ, సత్సంగం, భజన చేసుకుంటూ పూజ్యశ్రీ మాస్టరుగారు చూపిన బాటలో నడవడానికి ప్రయత్నిస్తున్నాను. వారి సంపూర్ణ ఆశీస్సులు ఎల్లవేళలా నాకుండేటట్లు అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను.

ఓం సన్మార్గదర్శకాయ శ్రీ భరద్వాజ గురువే నమః

జై సాయి మాస్టర్!!

# ఆశాజ్యోతి

25వ పేజీ తరువాయి

శ్రీరామనవమి అందరం ఎంతో బాధతో వున్నప్పటికీ శ్రీరామనవమి యథాపూర్వంగానే జరిగింది. వారు భౌతికంగా లేనప్పటికీ ఆయన ఆదేశం మేరకు ఆ శ్రీరామనవమి రోజున బాబాగారి విశ్వరూపం గురించి చెప్పాను. ఆయన సూక్ష్మరూపంలో విని ఆనందించి నన్ను ఆశీర్వదించినట్లు అన్పించింది నాకు. వారు సమాధి చెందిన రెండవ రోజున ఆయనతో వున్నటువంటి సన్నిహిత సంబంధం వల్లనో లేక ఆయనపై వున్న భక్తి విశ్వాసాల వల్లనో లేక బాబా తత్వాన్ని రంగరించి మాచే ఆస్వాదింప చేసినందు వల్లనో గానీ నాలో ఒక ప్రేరణ కలిగింది. ఆరోజు నుంచి మాస్టార్ గారిని సాయినాథుడు నాకు ప్రసాదించిన నా రెండవ గురువుగా దృఢవిశ్వాసంతో భావించుకొనటం జరిగింది. మూడవ రోజున కాబోలు నాకు స్వప్నంలో కన్పించి "వెన్ అకేషన్ కమ్స్ యు విల్ రైజ్ టు దట్ (when occasion comes you will rise to that)" అని ఆశీర్వదించారు. ఇంకోసారి వారు మా ఇంట్లో సత్సంగం చేస్తున్నారు. నేను పాద నమస్కారం చేసుకుంటే ఆశీస్సులు ఇస్తూ కన్పించారు.

ఆయన భౌతిక దేహంతో వున్నప్పుడు ఏరకమైన అనుభూతి పొందానో, ఆయన కనుమరుగైన తర్వాత కూడా అదే అనుభూతిని నేను పొందుతూనే వున్నాను. ఆయన మనకిక లేరు అన్న భావన నాకు ఏ క్షణంలోనూ కల్గదు. ఆయన మందస్మిత వదనారవిందమే నాకళ్ళకు ఎప్పుడూ ప్రస్ఫుటంగా కన్పిస్తూంటుంది. ఆయన వాణి నాకెప్పుడూ విన్పిస్తునే వుంటుంది. సాయినాథుని మీద నాకెంత అచంచల మైనటువంటి భక్తి విశ్వాసాలున్నాయో, సాయినాధుణ్ణి అనుక్షణం స్మరించుటకు కారణభూతులైనటువంటి, మార్గదర్శకులైనటువంటి భరద్వాజ మాస్టార్ గారి పైన కూడా అంతటి అచంచలమైన భక్తి విశ్వాసాలున్నాయి. మాస్టరుగారి గురించి తెలుసుకునే కొద్దీ బాబా గురించి సంపూర్ణంగా అర్థం అవుతూంటుంది. వారు ఇరువురు నా రెండు చక్షువులు. మాస్టర్ జీ నాటికీ, నేటికీ, ఎప్పటికీ చిరంజీవులే.

# ద్వారకామాయి అనుభవమంటపము

26వ పేజీ తరువాయి

ఒంగోలుకి వచ్చాము. వచ్చేముందు కూడా వారి అనుమతితోనే రావడం జరిగింది. ఇక్కడకి వచ్చాక పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావన దర్శనం, మాస్టరుగారి నిలయంలో శ్రీమతి వేదమ్మగారి సత్సంగాలు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మగారి దివ్యసన్నిధానం, అక్కడ జరిగే ఉత్సవాలు,,, వీటన్నింటిలో పాల్గొనడం వల్ల ఎంతో ఆనందం పొందుతున్నాము. ఈవిధంగా శ్రీ సాయినాథులవారు ప్రతి అడుగు నా చేయి పట్టుకుని నడిపిస్తున్నారు. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్సులు.

# వార్తాలాపము

16వ పేజీ తరువాయి

మలదోషం తొలగిపోనిదే చిత్తశుద్ధి కలగదు. చిత్తశుద్ధి లేనిదే విరోచనుడు మొదలైన వారిలాగ 'దేహమే ఆత్మ' అనే బుద్ధిని పొందుతారు కానీ స్వరూప సాక్షాత్కారము కలుగదు. నిష్కామకర్మ ద్వారా అంతఃకరణము శుద్ధి కావడం పరమార్థ జ్ఞానము పొందడానికి సాధనము.

అలాగే ఉపాసన లేనివారు కూడా ఈ జన్మలో ఉపాసన ద్వారా విక్షేపదోషాన్ని పోగొట్టుకొని శ్రవణము మొ॥న వాటిలో ప్రవృత్తిని పెంపొందించుకోనిదే జ్ఞానాన్ని పొందలేరు. విక్షేపదోషము చేత (భయము, ఆందోళన మొదలైనవి మన సాధనకు అంతరాయము కలిగించేవి) దధీచి మహాముని చేసిన బ్రహ్మోపదేశం పట్ల ఇంద్రుడికి అభిరుచి కలగలేదు. అలాగే విక్షేపదోషము వుండడం వలన శ్రవణము మొ॥నవి జరుగవు. విధంగా స్వరూప సాక్షాత్కారము జరగదు.

కాబట్టి నిష్కామకర్మ, ఉపాసన – ఈ రెండింటి ద్వారా మలదోషము, విక్షేపదోషము ఈ రెండింటిని పోగొట్టుకొని, బ్రహ్మనిష్ఠుడైన మహాత్ముని దగ్గర శ్రవణము మొ॥న అనుష్ఠానము ద్వారా మహావాక్యాల నుంచి ఉద్భవించిన దృఢమైన అపరోక్షానుభూతిని పొందాలి.

పదవ ప్రసంగము సంపూర్ణము.

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS,** C/o. SRI MANGA BHARADWAJA TRUST

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68. Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 08592233271

Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", Payable at Hyderabad or Ongole.

# BOOKS CLASSIFICATION

## 1. BOOKS ON SHRI GURU DATTA

*శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు*

- శ్రీ గురు చరిత్ర + శ్రీ సాయి లీలామృతము (బౌండ్) 499-00
- శ్రీ గురు చరిత్ర 199-00
- శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి 149-00
- శ్రీ దత్తావతార మహత్యము 75-00

## 2. BOOKS ON SRI SAI BABA

*షిరిడి సాయిబాబా పై విరచితమైన శ్రీ షిరిడి గ్రంథములు*

- శ్రీ సాయి లీలామృతము 199-00
- శ్రీ సాయి సన్నిధి 199-00
- శ్రీ సాయి ప్రబోధామృతము 119-00
- శ్రీ సాయినాథ పూజ 49-00
- షిరిడి హారతులు 15-00
- శిరిడి క్షేత్ర సందర్శనము 49-00
- సాయినాథ స్తవన మంజరి 10-00
- సాయిని పూజించడం ఎందుకు? 10-00
- సాయి సూక్తి ఆచార్యవాణి 20-00
- శ్రీ సాయి నిత్య సత్య వ్రతము 20-00

## 3. BOOKS ON MAHATMAS

*ఇతర మహాత్ముల గ్రంథములు*

- శ్రీ అక్కల్ కోట స్వామి 75-00
- శ్రీ తాజుద్దీన్ బాబా 75-00
- శ్రీ అవధూత వెంకయ్య స్వామి 99-00
- అవధూత శ్రీ చీరాల స్వామి 75-00
- శ్రీ పాకలపాటి గురువుగారు 75-00
- శ్రీ ఆనందమయి అమ్మ 75-00
- శ్రీ గురు సిద్ధారూఢ స్వామి 99-00
- శ్రీ అవధూత చివటం అమ్మ 99-00
- టిబెట్ యోగి మిలారేపా చరిత్ర 99-00

## 4. BOOKS ON ANVESHANA & SCIENCE & RELIGION

*అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు*

- ఏది నిజం 49-00
- మతం ఎందుకు 49-00
- విజ్ఞాన వీచికలు 99-00

## 5. BOOKS ON MEDITATION

*ధ్యాన సంబంధమైన గ్రంథములు*

- ధ్యానయోగ సర్వస్వము 75-00
- బుద్ధ ధ్యాన హృదయము 49-00

## 6. BOOKS ON SPIRITUALITY & TATVA CHINTANA

*ఆధ్యాత్మికత తత్వచింతన పూర్వ గ్రంథములు*

- సాయి మాస్టర్ ప్రవచనములు 199-00
- ఆధ్యాత్మిక జాగృతి 199-00

## 7. BOOKS ON PUJYA ACHARYA E.BHARADWAJA

*పూజ్య భరద్వాజ గురుదేవుల పై విరచితమైన గ్రంథములు*

- మహాత్ముల ముద్దుబిడ్డడు 149-00
- భగవాన్ శ్రీ భరద్వాజ 299-00
- మహా పురుషుడు 60-00
- సాయి మాస్టర్ స్మృతులు -1 199-00
- సాయి మాస్టర్ స్మృతులు -2 199-00
- ఆచార్య అమృత లేఖావళి 199-00
- మరో నంద దీపం 120-00
- మాస్టారు అమృత వాక్కులు 99-00

## 8. BOOKS FOR CHILDREN

*బాలల కొరకు విరచితమైన గ్రంథములు*

- బాలల సాయి లీలామృతము 49-00
- బాలల సాయిసన్నిధి 75-00
- బాలల శ్రీ గురు చరిత్ర 75-00

## 9. BOOKS IN ENGLISH

*ఆంగ్లంలో విరచితమైన గ్రంథములు*

- SAI BABA THE MASTER 249-00
- SHRI GURU CHARITRA 149-00
- SUPREME MASTER 149-00
- TAJUDDIN BABA 149-00
- SAI BABA AND HIS TEACHINGS 149-00
- CHILDREN'S SAI BABA THE MASTER 80-00

## 10. BOOKS IN OTHER LANGUAGES

*ఇతర భాషలో విరచితమైన గ్రంథములు*

- सद्गुरु श्री साईं बाबा श्रीगुरुच 249-00
- కన్నడ సాయి లీలామృతం 249-00
- కన్నడ ప్రబోధామృతము 149-00
- కన్నడ గురు చరిత్ర 199-00
- కన్నడ సాయి సన్నిధి 249-00
- ఒరియా సాయి సన్నిధి 249-00
- కన్నడ మిలారెపా చరిత్ర 119-00
- కన్నడ స్వామి సమర్థ 119-00
- తమిళ్ సాయి లీలామృతము 249-00
- తమిళ్ షిరిడి హారతులు 29-00
- తమిళ్ స్తవన మంజరి 20-00
- తమిళ్ శ్రీ గురుచరిత్ర 299-00
- మలయాళ సాయి లీలామృతం 299-00
- మలయాళం గురు చరిత్ర 299-00

## 11. OTHER BOOKS

*ఇతర గ్రంథములు*

- సత్సంగము భజన 10-00
- పురుష సూక్త రహస్యము 49-00
- మనము మన సంస్కృతి 75-00



Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust, Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.




పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ద్వితీయ ఆరాధనా మహోత్సవము జూన్ (2023) 3, 4 తేదీలలో 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము', గుమ్మళంపాడు లో వైభవంగా జరిగింది. భక్త జనులందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రద్ధా భక్తులతో పాల్గొన్నారు.